MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 24 సంచిక: 8 రంగారెడ్డి ఏప్రిల్ 2026 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ఏపిమాస్ కార్యక్షేత్రాలలో మహిళా దినోత్సవ సంరంభం !



గుడి మల్కాపూర్‌లో ...



హైదరాబాదులో

Silver Jubilee Year
apmas
Empowering Communities






వీలేరులో ...




మహారాష్ట్రలోని అంబుజ ఫౌండేషన్ ఏక్తా ఎస్ హెచ్ జి సమాఖ్యకు ఏపిమాస్ శిక్షణ దృశ్యం

NABARD నాబార్డ్ సౌజన్యంతో....

# వాతావరణ మార్పుల ప్రభావం

## వ్యవసాయంపై ...

వాతావరణ మార్పులు - వ్యవసాయం కరువు కాటకాల పాలు
పెరిగే ఎండలతో కరువు కాటకాలు - అధికమైన చీడపీడలు
భూమి గట్టిపడటం - భూసారం తగ్గిపోవడం
అడుగంటిన భూగర్భ జలాలు - ఆవిరవుతున్న నీటి వనరులు

భూమిలో తేమ లేదు - వేసిన విత్తు మొలవదు
అకాల వర్షాలు - నీరంతా సముద్రం పాలు
భూమిలోకి నీరు ఇంకదు - పంటకు నీరు అందదు

చేతికి రాని పంటలు - తగ్గిపోతున్న పంట దిగుబడులు
మేత, నీరు అందని జీవాలు - తగ్గిపోతున్న పశు సంపద
ఉపాధిలేని కుటుంబాలు - పెరుగుతున్న వలసలు
అప్పుల భారంతో వ్యవసాయం నష్టాల పాలు-
కృంగిపోతున్న రైతన్న జీవితాలు
అయినా... వానకోసం రైతన్న పడిగాపులు



## జీవనోపాధులపై....



పెరిగే వలసలు

రోగాలతో
పెరుగుతున్న ఖర్చులు

ఆహార
భద్రతకు ముప్పు

పోషకాహార
లోపాలు

తగ్గే ఉపాధి
అవకాశాలు

పంట నష్టాలతో
పెరిగే అప్పులు

NABARD

# మహిళా సాధికారత

సంపుటి 24 సంచిక 8




సంపాదకీయం

## ఎఫ్ పి ఓలు !

**మ**న దేశంలో వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలు లేదా రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా పిలువబడే ఎఫ్ పి ఓల ప్రస్థానం రెండు దశాబ్దాలకు పైగా సాగుతున్నప్పటికి, ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ ప్రభుత్వం 2027–28 నాటికి కొత్తగా పదివేల ఎఫ్ పి ఓలు ఏర్పాటయ్యేలా చూడాలన్న కేంద్ర ప్రభుత్వ రంగ పథకాన్ని (సెంట్రల్ సెక్టర్ స్కీమ్) 2020లో ప్రారంభించిన అనంతరమే ఎఫ్‌పిఓ వ్యవస్థ నూతనోత్తేజాన్ని పుంజుకున్నది. చాలావరకు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎఫ్‌పిఓల ఏర్పాటు, బలోపేతం పట్ల శ్రద్ధ చూపుతుండడంతో ఆశించిన సంఖ్యలో ఎఫ్ పి ఓల ఏర్పాటు సుగమమైంది. కాని, ఎఫ్ పి ఓలకు ప్రభుత్వ సహకారానికి సంబంధించిన నియమాలు, కట్టుబాట్లు క్షేత్రస్థాయి వాస్తవ స్థితిగతులకు తగినంత అనుగుణంగా లేకపోవడం ఎఫ్ పి ఓల ప్రగతి గమనానికి అవరోధాలను కలిగిస్తున్నది. కొన్ని ఆచరణ సాధ్యంకాని నియమాలు, మార్గదర్శకాల పట్ల ఎంతో ఆందోళన వ్యక్తం కావడం, ఎన్నో సవరణలు చేయాలనే ప్రతిపాదనలు వెల్లువెత్తడంతో వాటిలో కొన్నిటికి మార్పుచేర్పులు చేసినప్పటికి, నిర్వహణపరమైన ప్రత్యక్ష అనుభవాల దృష్ట్యా ఎప్పటికప్పుడు సవరించుకోవలసినవి అనేకం వుంటాయి. ఉదాహరణకు ఎఫ్ పి ఓలకు ప్రభుత్వం నుంచి ఎరువుల సరఫరా లైసెన్సు ఎఫ్ పి ఓ – సి ఇ ఓ ల పేరిట వుంటున్నది. ఏ కారణం వల్లనైనా ఆ సి ఇ ఓ రాజీనామా చేస్తే, ఆ ఎఫ్ పి ఓకు ఎరువులు పొందడానికి యిబ్బంది ఏర్పడుతున్నది. నిజానికి సి ఇ ఓ ఒక ఉన్నతోద్యోగి మాత్రమే. ఎఫ్ పి ఓతో సి ఇ ఓలది విడదీయలేని అనుబంధమేమీ కాదు. ఎఫ్ పి ఓ పేరిటనే లైసెన్స్ వుంటే యిటువంటి సమస్య ఏర్పడదు. ఈ కారణంగా, డబ్బులు చెల్లించి కొనుగోలు చేయడం కాకుండా, ముందు సరకు సరఫరా అయిన తర్వాత చెల్లించే ఎఫ్ ఓ ఎల్ (ఫ్రీ ఆన్ లింక్) విధానంలో ఎరువులు సరఫరాకాక, తగినంత వ్యాపారం చేయలేక, సీజన్ దాటిపోయి, ఆదాయం తగ్గి ఎఫ్ పి ఓలలో నిరుత్సాహం ఏర్పడుతున్నది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ లైసెన్సుల తీరుకూడా యిలానే వుంటున్నది. పాలకవర్గంలో, సభ్య రైతులలో తమ ఎఫ్ పి ఓను అభివృద్ధిలో మేటిగా తీర్చిదిద్దుకోవాలని ఎంతో తపన వున్నప్పటికి, ఇలాంటి అవరోధాల కారణంగా, ఆశించిన, సాధిస్తామని అంగీకరించిన లక్ష్యాలను చేరుకోలేక, వైఫల్యమనే ముద్రతో యిటువంటి ఎఫ్ పి ఓలు సతమతమవుతున్నాయి. నిర్వహణపరమైన ఈ సమస్యలను వాస్తవిక దృక్పథంతో ప్రభుత్వాలు పరిష్కరిస్తేనే ఎఫ్ పి ఓలు ప్రగతి పథంలో మరిన్ని ముందడుగులు వేయగలుగుతాయి. ఇలాంటివి చిన్న సమస్యలుగానే అనిపిస్తాయి. కాని, చిన్నచిన్నవే పేరుకుపోతే, సవరించుకోలేని పెద్ద సమస్యలుగా మారుతాయి.

ఇక, రైతుల క్షేమంకోరి, తెలంగాణా శాసనసభ చేసిన ఒక తీర్మానం ఎంతైనా అభినందనీయం! పారాక్వాట్ డైక్లోరైడ్ అనే రసాయనిక కలుపుమందు రైతులకు ప్రాణాంతకంగా పరిణమించింది. ఈ మందు సైనైడ్ కంటె విషపూరితమట! కలుపు నివారణలో బాగా పని చేస్తుండడం, ధర ఎక్కువగా లేకపోవడం, సులువుగా దొరుకుతుండడంతో దాదాపుగా రైతులందరి ఇళ్ళలో ఈ కలుపు మందు వుంటున్నది. ఏవో క్షణికావేశాలతో పలువురు ఈ మందు తాగి ప్రాణాలు కోల్పోతున్నారు. తెలంగాణాలో ప్రతి ఏటా దాదాపు ఆరు వేలమంది ఈ పారాక్వాట్‌కు బలి అవుతున్నారంటేనే యిది ఎంతటి విషపదార్థమో, ఎంత ప్రాణాంతకమో అర్థమవుతుంది. ఈ రసాయనికాన్ని యిప్పటికే కొన్ని దేశాలు నిషేధించాయి. మన దేశంలో కూడా ఈ మందును నిషేధించాలన్న ఆందోళన ఎంతో కాలంగా వుంది. ఇప్పుడు తెలంగాణా శాసనసభ ఈ మందును నిషేధించాలని కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తూ, ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇతర రాష్ట్రాలు కూడా యిలాంటి తీర్మానాలు చేస్తాయని, కేంద్ర ప్రభుత్వం త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశిద్దాం. తెలంగాణా శాసనసభకు, రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక అభినందనలు.



**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**

అలవాటుగా మలచుకుంటే కష్టం సులువవుతుంది, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: జి. శ్రీనివాస్, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మాచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సాంకేతిక సహకారం: క్రిస్టాఫర్ వసంత్**

**లోపలి పేజీలలో ....**

- 'స్టార్ అమ్మ'లతో మెరిసిన మహిళా దినోత్సవం 05
- పీలేరు ఏపిమాస్‌లో మహిళా దినోత్సవం 07
- మహారాష్ట్ర ఏక్తా ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్‌కు శిక్షణ 08
- యుద్ధ సంక్షోభంలో ప్రకృతి సేద్యమే పరిష్కారం 10
- బిర్యానీ ఆకు సాగుతో భేషైన సంపాదన 12
- వర్షాలకు పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలు 13
- క్యాన్సర్ కారకాలు మన ఇళ్ళలోనే... 15
- మామిడి మార్కెటింగ్ బృందానికి అవగాహన 16
- 'వాష్' పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం 17
- టార్పాలిన్ల కొనుగోలుకు మేఘా సాయం! 18
- సి ఎస్ వి పి మూల్యాంకన బృందం సందర్శన 19
- తెలుగు రైతమ్మల సాటిలేని సాగు తీరు! 20
- వరిలో తెగుళ్ళ బెడద : ఆందోళనలో రైతులు 24
- ప్రాణాంతకమైన గడ్డిమందు పారాక్వాట్ 25
- రైతుల రాబోయే ఎరువు బి ఎస్ ఎఫ్ లార్వా! 28
- ఇక ... రంగుల పత్తి రంగప్రవేశం! 29
- స్వయం సహాయ మహిళలకు కంప్యూటర్ 30
- 50 ఏళ్ళు దాటిన మహిళలకు పరీక్షలు 31
- మహిళలకు పూచీకత్తు లేకుండా10లక్షల రుణం 32
- 'మిస్ ఇన్ఫినిటీ ఆఫ్ ఇండియా' దీప్తి శ్రీరంగం 33
- ఎండిన నదికి తిరిగి జీవం పోసిన మహిళాశక్తి 34

## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పని చేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతో పాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం 'మహిళా సాధికారత' పత్రికతో పాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

సంకల్పం తొలి అడుగు వేయిస్తుంది , అలవాటు కడదాకా నడిపిస్తుంది

# 'స్టార్ అమ్మ'లతో మెరిసిన మహిళా దినోత్సవం!

– జాహ్నవి ఎర్రబెల్లి



ఏపిమాస్ పట్టణ పోషణ పథక బృందం గుడిమల్కాపూర్, శివాజీనగర్ ప్రాంతాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, రిసోర్స్ పర్సన్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు సుమారు 150 మంది పాల్గొన్నారు.

కార్యక్రమం ప్రారంభంలో పట్టణ పోషణ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి ఎల్. భవాని ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళల దినోత్సవ థీమ్ "గివ్ టు గెయిన్" (ఇవ్వడం ద్వారా పొందడం) గురించి వివరించారు. మహిళల, పిల్లల ఆరోగ్యం, పోషణపరంగా మహిళలకు సరైన ఆహారం, జ్ఞానం, అవగాహన, రక్షణ అందించినప్పుడు, వారు మంచి ఆరోగ్యంతో పాటు మెరుగైన పోషణ స్థితిని పొందగలరని ఆమె తెలిపారు.

శిశు సంక్షేమ ప్రాజెక్ట్ అధికారిణి శ్రీమతి రేణుక , పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త శ్రీ భరత్, రాష్ట్ర మహిళా కమిషన్ ప్రతినిది ఝాన్సీ గారు, మహిళా, శిశు అభివృద్ధి శాఖకు చెందిన దీప్తి , ఏపిమాస్ సంస్థ తరపున డైరెక్టర్ డా. అరుణ, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ కే. శ్రీనివాస్ కూడా కార్యక్రమలో పాల్గొని, తమ సందేశాలతో ప్రేరణ కలిగించారు.

ఈ వేడుక మొత్తం "గివ్ టు గెయిన్" అనే ప్రేరణాత్మక భావన చుట్టూ సాగింది. "ఇవ్వడం" అంటే మద్దతు, అవగాహన, హక్కుల రక్షణ, సేవలు అందించడం అని శ్రీమతి ఝాన్సీ వివరించారు. దీనివల్ల మహిళలు ఆరోగ్యకరంగా, సురక్షితంగా, గౌరవంతో జీవించగలరని చెప్పారు. దీని ఫలితంగా చక్కని కుటుంబ వ్యవస్థ, ఆరోగ్యకరమైన పిల్లలు, సమానత్వంతో కూడిన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. మహిళకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని, హక్కులపై అవగాహన పెంపొందించాలంటూ, మహిళలు ఏ విధమైన హింస లేదా వివక్షకు గురైనప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని శ్రీమతి దీప్తి తెలిపారు.

మనిషి జీవితపు మొదటి వెయ్యి రోజులు తల్లికి, శిశువుకు అత్యంత కీలకమైన సమయమని శ్రీమతి రేణుకపేర్కొన్నారు. ఈ సమయంలో ఎలా వ్యవహరించాలనే విషయమై సరైన సమాచారం ఇవ్వడం, అవగాహన కలిగించడం ఎంతో ముఖ్యమని చెప్పారు. తల్లులకు సరైన పోషణ, గర్భధారణ, ప్రసవానంతర సంరక్షణ, శిశు పోషణపై అవగాహన పెంపొందించడం ద్వారా మంచి ఆరోగ్యం సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.

"దేశమంటే మట్టి కాదోయ్ , దేశమంటే మనుషులోయ్" అనే ప్రేరణ గీతాన్ని శ్రీ భరత్ సవరిస్తూ, 'దేశమంటే

మెరుగుపెట్టని పుత్తడి కంటె మెరిసిపోయే ఇత్తడే పలువురిని ఆకర్షిస్తుంది

మహిళలు' అని ప్రస్తావించారు. మహిళల, బాలికల ఆరోగ్యం, పోషణ, సంక్షేమాన్ని కుటుంబ స్థాయిలో చక్కగా చూసుకుంటే బలమైన కుటుంబాలు ఏర్పడతాయని తెలిపారు. అటువంటి కుటుంబాలు కలిసి శక్తివంతమైన సమాజాన్ని నిర్మిస్తాయని, అందులో మహిళలకు స్వరం, నిర్ణయాధికారం, గౌరవంతో జీవించే అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

డా. అరుణ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే బాలికల పట్ల శ్రద్ధవహించడం అవసరమని పేర్కొన్నారు. సరైన పోషణ, ఆరోగ్య సంరక్షణ, అవగాహన కల్పిస్తే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండేందుకు బలమైన పునాది ఏర్పడుతుందని, లేకపోతే పోషకాహార లోపం తరతరాలకు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

మంచి పోషణ మాత్రమే సరిపోదని, దానికి సురక్షితమైన తాగునీరు, శుభ్రమైన పరిసరాలు, చేతులు కడుక్కోవడం వంటి పరిశుభ్రత అలవాట్లు అవసరమని, ఇవి సంక్రమణ వ్యాధులను నివారించడంలో, పోషకాలు శరీరానికి సమర్థవంతంగా చేరేలా చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని శ్రీ శ్రీనివాస్ వివరించారు.

ఈ కార్యక్రమంలోని ప్రధాన భాగం "స్టార్ అమ్మ" గుర్తింపు, సత్కారం. గర్భధారణ నుంచి చిన్నారి రెండేళ్లు పూర్తయ్యేవరకు ఉండే మొదటి వెయ్యి రోజుల కాలంలో తల్లి,శిశు ఆరోగ్యానికి సంబంధించిన సరైన పోషణ ఆరోగ్య పద్ధతులను సక్రమంగా పాటించిన తల్లులను ఆరోగ్య కార్యకర్తలు గుర్తించారు. వారిని ఒక ప్రత్యేక ప్రక్రియద్వారా ఎంపికచేస్తారు. వీరిని ప్రాజెక్టు అధికారిణి, మెడికల్ ఆఫీసర్ ధృవీకరించ వలసి వుంటుంది కూడా! ఈ విధంగా ఎంపికైన తల్లులను "స్టార్ అమ్మ" బిరుదుతో సత్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సత్కారం వారి కృషికి గుర్తింపుగా నిలవడమే కాకుండా ఇతర తల్లులకు ప్రేరణగా కూడా మారింది.

సమావేశం అనంతరం సంతోషాన్ని, ఉత్సాహాన్ని కలిగించేందుకు, పిఓలు జాహ్నవి, తేజశ్విని వినోదభరితమైన ఆటలను నిర్వహించారు. తల్లులు, అంగన్వాడీ టీచర్లు ఉత్సాహంతో పాల్గొని ఈ వేడుకను మరింత గుర్తుండిపోయేలా చేశారు. మహిళలను గౌరవించి, ప్రోత్సహించినప్పుడు కుటుంబాలు బలపడతాయి, సమాజం ఆరోగ్యంగా అభివృద్ధి చెందుతుంది అనే బలమైన సందేశాన్ని ఈ వేడుక అందరికీ అందించింది.

**బోజగుట్టలో ...**

బోజగుట్టలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలకు చెందిన సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు.

కార్యక్రమం ప్రారంభంలో ప్రాజెక్ట్ మేనేజర్ భవాని గారు ఈ సంవత్సరం మహిళా దినోత్సవం థీమ్ అయిన "గివ్ టు గైన్ ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు ఒకరికొకరు సహాయం చేసుకుంటూ, అవగాహనను, అవకాశాలను పంచుకుంటే సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు.

తర్వాత సిఐటియు పార్టీ లోకల్ లీడర్ మల్లేష్ గారు కార్యక్రమంలో పాల్గొని మహిళల హక్కులు, ఐక్యత, ఆర్థిక స్వావలంబనపై విలువైన అంశాలను వివరించారు.

మొత్తంగా ఈ కార్యక్రమం మహిళల్లో అవగాహన పెంచుతూ, "గివ్ టు గైన్" అనే థీమ్ సందేశాన్ని బలంగా చాటి చెప్పింది. ■

### వర్షపు నీటిని ఒడిసిపట్టడం అభినందనీయం

వర్షపు నీటిని ఒడిసి పట్టడం అభినందనీయమని ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని బోంద్రబట్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలు శ్రీమతి సిందే అర్చన ఏర్పాటు చేసిన వర్షపు నీటిని ఒడిసిపట్టే ప్లాంటును ఆయన పరిశీలించి, ఆమెను అభినందించారు. తాగునీటి కొరతను అధిగమించేందుకు, ఆరోగ్యానికి అవసరమైన స్వచ్ఛమైన నీటి కోసం ఇలాంటి పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఎంతైనా వున్నదని ఆయన పేర్కొన్నారు. ■

# పీలేరు ఏపిమాస్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

– డా. భార్గవి

**పీ**లేరులో ఏపిమాస్, అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మార్చి 7న నిర్వహించారు. ఈ కార్యక్రమం మహిళల మహోన్నత కృషిని గౌరవించడంతో పాటు, లైంగిక సమానత్వాన్ని ప్రోత్సహించడం, మరింత సమగ్రమైన కార్యాచరణ వాతావరణాన్ని సృష్టించడం లక్ష్యంగా నిర్వహించబడింది.

ఈ వేడుకలు ముఖ్య అతిథులు, ప్రభుత్వ కళాశాల ఉపన్యాసకురాలు, పీలేరు స్వయం సహాయ సంఘం,మహిళా ఎఫ్.పి.ఓ బోర్డు సభ్యుల సందేశాలతో ప్రారంభమయ్యాయి. మహిళా సాధికారత, నాయకత్వం, సమాజంలో మహిళల పాత్రపై వారు ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ అనుభవాలను, తాము ఎదుర్కొన్న సవాళ్లను, విజయం సాధించిన సందర్భాలను పంచుకున్నారు. లైంగిక భేదాలను అధిగమించి, తాము ఎలా విజయాలను సాధించారో వివరించారు.



మహిళా దినోత్సవాన్ని మరింత ప్రత్యేకంగా చేసేందుకు మహిళలకు ప్రత్యేక ఆటలను, విశేష సేవలు అందించిన మహిళా ఉద్యోగులను గౌరవిస్తూ ప్రత్యేక ప్రశంసా కార్యక్రమాన్ని ఏపిమాస్ నిర్వహించింది.

ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ డా. భార్గవి మాట్లాడుతూ, “అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది మహిళల బలాన్ని, సహనాన్ని, అంకితభావాన్ని గుర్తు చేసే రోజు. మా కార్యాలయంలో సమానత్వం, గౌరవం, సమాన అవకాశాల సాంస్కృతిక వాతావరణాన్ని పెంపొందించేందుకు మేము కట్టుబడి ఉన్నాము” అని తెలిపారు. ప్రతి మహిళ తన కెరీర్‌లో విజయాన్ని సాధించేలా ఏపిమాస్ కృషి చేస్తుందని సంస్థ హామీ ఇచ్చింది.

**ప్రత్యేక కార్యక్రమాలు**

**ఆరంభ కార్యక్రమం :** ఉదయం మేనేజ్మెంట్ సభ్యుల సమక్షంలో మహిళా దినోత్సవ శుభాకాంక్షలతో ప్రారంభమైంది. సంస్థ సిబ్బంది మహిళా ఉద్యోగులను ప్రోత్సహిస్తూ ప్రసంగించారు.

**అనుభవాల వివరణ :** వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు తమ అనుభవాలు పంచుకున్నారు. తమ ఉద్యోగప్రయాణం, ఎదురైన సవాళ్లు, విజయాలను గురించి చక్కగా వివరించారు.

**గాన మాధుర్యం :** ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు సంగీత ప్రదర్శనలు నిర్వహించి, కార్యాలయాన్ని ఉల్లాసభరితం చేశారు. ఆసక్తికరమైన ఆటలు నిర్వహించి అందరికీ ఉల్లాసాన్ని కలిగించాయి.



**సన్మానాలు, బహుమతులు :** సమాజంలో విశేషమైన సేవలు అందించిన మహిళా ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మహిళలందరూ ప్రత్యేక గిఫ్ట్ హ్యాంపర్స్ అందుకున్నారు.

ఈ వేడుకల ద్వారా మహిళలను గౌరవించినందుకు, వారి కృషిని గుర్తించినందుకు అందరూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మహిళా సాధికారతపై చైతన్యం పెంపొందించేందుకు, వారికి మరింత బలం, ఉత్సాహం కలిగించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో సహాయపడిందని అభిప్రాయపడ్డారు.

మహిళలు అన్ని రంగాల్లో సుస్థిరంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ, ఈ వేడుక విజయవంతంగా ముగిసింది. ■

అనాలోచితంగా చేయగలిగే పనే అలవాటు, మంచి అలవాటు సదా మంచినే చేయిస్తుంది

# మహారాష్ట్ర 'ఏక్తా' ఎస్ హెచ్ జి ఫెడరేషన్‌కు శిక్షణ

– జి. శ్రీనివాస్

మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా హార్డోనా, ఉప్పరవాహి ప్రాంతాల్లో అంబుజా ఫౌండేషన్ ప్రోత్సహించిన ఏక్‌తా మహిళా స్వయం సహాయ సంఘాల ఫెడరేషన్ బోర్డు సభ్యులకు (బిఓడిఎస్), సిబ్బందికి ఏపిమాస్ ఆధ్వర్యంలో 2026 మార్చి 25,26 తేదీలలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమానికి ఏపిమాస్ నుండి శ్రీ జి. శ్రీనివాస్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని, ఫెడరేషన్ బలోపేతానికి అవసరమైన కీలక అంశాలపై మార్గదర్శనం అందించారు.



**నేపథ్యం :** ఏక్‌తా ఫెడరేషన్ ప్రస్తుతం అనేక స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జిలు) సేవలు అందిస్తూ, గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తోంది. అయినప్పటికీ, ఫెడరేషన్‌లో పరిపాలన, ఆర్థిక నిర్వహణ, రికార్డు నిర్వహణ, చట్టపరమైన విధానాల్లో కొన్ని లోపాలు ఉన్నాయని అంబుజా ఫౌండేషన్ ప్రతినిధులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేయడానికి, భవిష్యత్తులో ఉత్తమ ఫెడరేషన్‌గా ఎదిగేలా చేయడానికి ఈ శిక్షణను రూపకల్పన చేశారు.

**శిక్షణ లక్ష్యాలు**

ఈ శిక్షణ ప్రధానంగా క్రింది లక్ష్యాలతో నిర్వహించబడింది:

- ఫెడరేషన్ పరిపాలన, నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయడం
- బోర్డు సభ్యుల, సిబ్బంది పాత్రలు, బాధ్యతలపై స్పష్టత కల్పించడం
- రికార్డు నిర్వహణ, డాక్యుమెంటేషన్ పద్ధతులను మెరుగుపరచడం
- ఆర్థిక పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థలపై అవగాహన పెంపొందించడం
- ఫెడరేషన్‌ను అవార్డు అర్హత దిశగా సిద్ధం చేయడం

ఈ శిక్షణలో మొత్తం 15 మంది బోర్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. వీరు ఫెడరేషన్ స్థాయిలో నిర్ణయాలు తీసుకోవడంలో, గ్రామ స్థాయిలో కార్యకలాపాలను అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా శిక్షణను మరింత ప్రయోజనకరంగా మార్చారు.

**శిక్షణ పద్ధతి :** ఈ శిక్షణ పూర్తిగా సహభాగ, అనుభవాధారిత పద్ధతిలో నిర్వహించబడింది. సాధారణ ప్రసంగ విధానానికి బదులుగా, ఆటలు, గ్రూప్ చర్చలు, పాత్రాభినయాలు (రోల్ ప్లేస్), అనుభవ పంచుకోవడం వంటి పద్ధతులను వినియోగించారు. ఈ విధానం వల్ల పాల్గొనేవారు విషయాలను సులభంగా అర్థం చేసుకోవడమే కాకుండా, తమ రోజువారీ కార్యకలాపాలకు అన్వయించుకోవడం సాధ్యమవుతుంది. ముఖ్యంగా, నాయకత్వం, సమావేశాల నిర్వహణ, రికార్డు నిర్వహణ వంటి అంశాలపై ప్రాక్టికల్ అవగాహన పెరిగింది.

**శిక్షణ నిర్వహణ**

**మొదటి రోజు :** ఫెడరేషన్ ప్రాముఖ్యత, నిర్మాణం, నాయకత్వ పాత్రలు, పరిపాలన వ్యవస్థలు, అవార్డు సూచికలపై చర్చలు జరిగాయి. శిక్షణపట్ల అభ్యాసకుల ఆశలను, అంచనాలను తెలుసుకొని, శిక్షణను వాటికి అనుగుణంగా నిర్వహించారు.

ఏ పని చేసినా మనస్ఫూర్తిగా చెయ్యి , ఫలితమూ అంతే సంపూర్ణంగా వుంటుంది



**రెండవరోజు:** సమావేశాల నిర్వహణ, రికార్డు నిర్వహణ, ఆర్థిక వ్యవస్థలు, పారదర్శకత, బాధ్యత పై ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించబడ్డాయి. చివరిగా ఉత్తమ నిర్వహణ పద్ధతులను, కార్యాచరణ ప్రణాళికను (యాక్షన్ ప్లాన్) రూపొందించారు.

**ముఖ్య ఫలితాలు, నేర్చుకున్న పాఠాలు**

ఈ శిక్షణలో పాల్గొనేవారిలో పరిపాలన వ్యవస్థలు, నాయకత్వ బాధ్యతలు, సంస్థాగత ప్రక్రియలపై స్పష్టమైన అవగాహన ఏర్పడింది. ముఖ్యంగా :

- రికార్డు నిర్వహణలో మెరుగుదల అవసరాన్ని గుర్తించారు
- ఆర్థిక పారదర్శకత , బాధ్యతపై అవగాహన పెరిగింది
- సమావేశాల ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నారు
- ఫెడరేషన్‌ను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలనే నిబద్ధత పెరిగింది

**గుర్తించిన లోపాలు :** శిక్షణ సమయంలో కొన్ని ముఖ్యమైన లోపాలు గుర్తించబడ్డాయి:

- అన్ని ఎస్‌హెచ్‌జిలు ఫెడరేషన్‌లో సభ్యులుగా లేవు
- రికార్డు నిర్వహణలో బలహీనత
- రుణ చెల్లింపులలో అసమర్థత
- నాయకత్వ మార్పిడి లేకపోవడం
- ఆడిట్లు ,చట్టపరమైన ప్రక్రియల్లో ఆలస్యం

అయినప్పటికీ, అభ్యాసకులలో మార్పు పట్ల ఆసక్తి, నిబద్ధత స్పష్టంగా కనిపించాయి.

**తీసుకోవలసిన తక్షణ చర్యలు :** ఫెడరేషన్ బలోపేతానికి క్రింది చర్యలు చేపట్టాలని సూచించారు:

- అన్ని ఎస్‌హెచ్‌జిలను ఫెడరేషన్ సభ్యులుగా చేర్చడం
- సేవింగ్స్‌ను బలోపేతం చేయడం
- పద్ధతిగా సమావేశాలు నిర్వహించడం
- నెలవారీ రుణ చెల్లింపు విధానం అమలు చేయడం
- పెండింగ్ ఆడిట్లను పూర్తి చేయడం
- నాయకత్వ మార్పిడి అమలు చేయడం
- ఏజిఎం సమావేశాన్ని సమయానికి నిర్వహించడం
- ఉప కమిటీలను ఏర్పాటు చేయడం

**అభ్యాసకుల అభిప్రాయాలు (పార్టిసిపెంట్స్ ఫీడ్‌బ్యాక్):** శిక్షణలో పాల్గొన్నవారు శిక్షణపై చాలా సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆటలు, చర్చల ద్వారా నేర్చుకోవడం సులభమైందని, తమలో ఉన్న లోపాలను గుర్తించగలిగామని తెలిపారు. భవిష్యత్తులో మరికొన్ని శిక్షణలు తమకు అందించాలని కోరారు.

**సహకారం, భవిష్యత్ ప్రణాళికలు :** అంబుజా ఫౌండేషన్ ఏపిమాస్ సంస్థలు భవిష్యత్తులో కూడా ఈ ఫెడరేషన్ బలోపేతానికి సాంకేతిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపాయి. బుక్‌కీపింగ్, ఆడిటింగ్, ఫీల్డ్ సపోర్ట్, ఎక్స్‌పోజర్ విజిట్స్ వంటి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

ఈ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఏక్తా ఫెడరేషన్ అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా నిలిచింది. పరిపాలన, నిర్వహణ, వ్యవస్థల బలోపేతానికి ఇది పునాది వేసింది. తక్షణ చర్యలు తీసుకుంటూ, నిరంతర సాంకేతిక సహాయంతో ఈ ఫెడరేషన్ భవిష్యత్తులో ఆదర్శ ఫెడరేషన్‌గా ఎదగగల సామర్థ్యం కలిగి ఉంది.

ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో అంబుజా ఫౌండేషన్ ప్రతినిధులు, ఏపిమాస్ బృందం, ఏక్తా ఫెడరేషన్ సభ్యుల సహకారం ఎంతో ముఖ్యమైనది. ■

స్వరూపం స్వభావానికి సాక్ష్యం కాదు ; అద్దమూ స్వరూపాన్నే చూపుతుంది స్వభావాన్ని కాదు

# యుద్ధ సంక్షోభంలో ప్రకృతి సేద్యమే పరిష్కారం!

డా. ఆర్ రమాదేవి

**మ**న దేశ ఎరువుల పరిస్థితి అంతర్జాతీయ ఒడిదుడుకులకు గురయ్యే అవకాశం ఎప్పుడూ ఉంది, ఎందుకంటే, మన ఎరువుల వ్యవస్థలో అధిక భాగం దిగుమతి చేసుకున్న ముడి పదార్థాలు, దిగుమతి చేసుకున్న ఎరువులు, దిగుమతి చేసుకున్న ఇంధనంపై ఆధారపడి ఉంది. అంటే, ఎరువుల విషయంలో దిగుమతులపై ఆధారపడకుండా, స్వయం సమృద్ధిని సాధించడంకోసం ప్రభుత్వం ఏమీ చేయడం లేదని అర్థం కాదు. వాస్తవానికి, కేంద్ర ప్రభుత్వం ఇటీవలి సంవత్సరాలలో దేశీయ యూరియా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించింది. దేశీయ ఎరువుల నిల్వలు సరిపోతాయని ఇటీవల చెప్పే స్థాయికి చేరుకుంది. కానీ, భారతదేశం, ఫాస్ఫేటిక్ , పొటాసిక్ ఎరువుల విషయంలో, ఇంకా పూర్తి స్వయం సమృద్ధిని సాధించలేదు..

ఇంధనం, అమ్మోనియా, యూరియా, సల్ఫర్ రవాణాకు, నౌకా మార్గాలకు ప్రపంచంలోని చాలా దేశాలు ఆధారపడే కీలక భౌగోళిక కేంద్రం పశ్చిమ ఆసియా. హోర్ముజ్ జలసంధి చమురు, ఎల్ఎన్‌జి (లిక్విడ్ నైట్రోజన్ గ్యాస్ ), ఎరువులకు సంబంధించిన సరుకుల రవాణాకు ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ప్రాంతం. ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయేల్ జరుపుతున్న యుద్ధం నౌకా రవాణాకు తీవ్రమైన అంతరాయం కలిగించింది. సరుకు రవాణా, బీమా ఖర్చులను పెంచింది భారతదేశంలోకి ఎల్ ఎన్ జి సరఫరాను తగ్గించింది. ఈ కారణంగా కొంతమంది భారతీయ ఎరువుల ఉత్పత్తిదారులు గ్యాస్ రేషనింగ్, ఉత్పత్తి కోతలను ఎదుర్కొన్నారని రాయిటర్స్ కూడా నివేదించింది.

ఇది ఎరువుల దిగుమతులను రెండు విధాలుగా ప్రభావితం చేస్తుంది. మొదటగా, హోర్ముజ్ లేదా సమీప మార్గాల గుండా ఓడలు ప్రయాణించలేకపోతే, యూరియా, డీఏపీ, సల్ఫర్, అమ్మోనియా, ఎల్ ఎన్ జి వంటి దిగుమతి చేసుకునే ఎరువులు, వాటి సంబంధిత సరుకులు ఆలస్యం అవుతాయి లేదా వాటి ధరలు పెరుగుతాయి. రెండవది, ప్రపంచవ్యాప్తంగా సరుకు అందుబాటులో ఉన్నప్పటికీ, అధిక యుద్ధ-ప్రమాద బీమా, రవాణా ఛార్జీలు, నౌకల కొరత భారతదేశానికి సరఫరాలను జాప్యం చేస్తుంది.

ఇది భారతదేశంలోని తయారీ రంగాన్ని కూడా ప్రభావితం చేస్తుంది, ఎందుకంటే ఎరువుల కర్మాగారాలు కేవలం గనుల నుండి తవ్విన పోషకాలపై మాత్రమే ఆధారపడవు; చాలావరకు సహజ వాయువు, దిగుమతి చేసుకునే ఎరువుల ఉత్పాదకాలపై ఆధారపడతాయి. యూరియాను అమ్మోనియా నుండి తయారు చేస్తారు, అమ్మోనియాను ప్రధానంగా సహజ వాయువు నుండి తయారు చేస్తారు.

గల్ఫ్ నుండి ఎల్ ఎన్ జి సరఫరాలకు అంతరాయం కలిగినప్పుడు, లేదా గ్యాస్ ధర పెరిగినప్పుడు, భారతీయ ఎరువుల కర్మాగారాలు ఫీడ్‌స్టాక్ కొరతను లేదా అధిక ఖర్చులను ఎదుర్కోవచ్చు. ప్రపంచవ్యాప్త ఎల్ ఎన్ జి అంతరాయాలు ఎరువుల ఉత్పత్తికి ముప్పుగా పరిణమించడంతో, భారత ప్రభుత్వం ఇటీవల ఎరువుల కర్మాగారాలకు గ్యాస్ సరఫరాను ప్రాధాన్యతాంశంగా సవరిస్తూ, సహజ వాయువు సరఫరా నియంత్రణ ఉత్తర్వును జారీ చేసింది.

సాంకేతికంగా, ఎరువుల కోసం భారతదేశం ఇతర దేశాలపై ఆధారపడటం పోషకాలను బట్టి మారుతుంది. యూరియా వంటి నత్రజని ఎరువులు పాక్షికంగా దేశీయంగా తయారవుతున్నాయి, గత కొన్నేళ్లుగా ఆరు కొత్త యూరియా ప్లాంట్లను ప్రారంభించడం ద్వారా భారతదేశం యూరియా ఉత్పత్తిని పెంచింది. 2023-24లో, దేశీయ యూరియా ఉత్పత్తి 314 లక్షల మెట్రిక్ టన్నులను దాటింది. అయినప్పటికీ, భారతదేశం తన యూరియా అవసరంలో కొంతభాగాన్ని దిగుమతి చేసుకోవడం కొనసాగిస్తోంది.

ఆరడుగుల మనిషి విలువ నాలుగంగుళాల నాలుకమీద ఆధారపడి వుంటుంది !

2024-25 సంవత్సరానికి సంబంధించిన పార్లమెంటరీ గణాంకాల ప్రకారం,యూరియాకు డిమాండ్ సుమారు 384 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఇందులో దేశీయ ఉత్పత్తి దాదాపు 315 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, దిగుమతులు సుమారు 66 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్నాయి.

ఫాస్ఫేటిక్ ఎరువులు ఒక పెద్ద నిర్మాణాత్మక సవాలుగా ఉన్నాయి. భారతదేశంలో తగినంత మంచి నాణ్యత గల దేశీయ రాక్ ఫాస్ఫేట్ లేదు. దేశంలో లభించే రాక్ ఫాస్ఫేట్‌లో అధిక భాగం తక్కువ గ్రేడ్‌కు చెందినది. దాని కారణంగా, భారతదేశం రాక్ ఫాస్ఫేట్, ఫాస్ఫారిక్ ఆమ్లం, సల్ఫర్, అమ్మోనియా, మరియు డీఏపీ వంటి తయారైన ఫాస్ఫేటిక్ ఎరువుల దిగుమతులపై ఎక్కువగా ఆధారపడి ఉంది. పరిమిత దేశీయ ముడి పదార్థాల లభ్యత కారణంగా ఫాస్ఫేటిక్ ఎరువులపై ఆధారపడటం దాదాపు 90% ఉందని భారత ప్రభుత్వం గతంలో అధికారిక ప్రకటనలలో పేర్కొంది.

ఇటీవలి పార్లమెంటరీ గణాంకాలు ఇప్పటికీ అధిక దిగుమతుల ఆధారపడటాన్ని చూపిస్తున్నాయి: 2024-25లో, డీఏపీ డిమాండ్ సుమారు 110 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, దేశీయ ఉత్పత్తి కేవలం 43 లక్షల మెట్రిక్ టన్నులు, దిగుమతులు సుమారు 56 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్నాయి.

పొటాష్ ఎరువులు అత్యధికంగా దిగుమతులపై ఆధారపడి ఉంటాయి. భారీ స్థాయిలో ఎరువుల ఉత్పత్తికి అవసరమైన పెద్ద దేశీయ పొటాష్ వనరులు భారతదేశంలో దాదాపుగా లేవు, కాబట్టి యం ఓ పి (మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వాస్తవంగా పూర్తిగా దిగుమతి అవుతోంది.

2024-25 సంవత్సరానికి సంబంధించిన పార్లమెంటరీ గణాంకాలు యం ఓ పి 100% దిగుమతి అవుతోందని స్పష్టంగా పేర్కొంటున్నాయి. అంటే ప్రపంచవ్యాప్త రవాణాలో ఏదైనా అంతరాయం, ఉత్పత్తిదారు దేశాల ఆంక్షలు లేదా ధరల పెరుగుదల వంటివి భారతదేశంలో పొటాష్ లభ్యతను, ధరను నేరుగా ప్రభావితం చేస్తాయి.

కాబట్టి, భారతదేశం పూర్తిగా స్వయం సమృద్ధి సాధించక పోవడానికి గల ప్రధాన సాంకేతిక కారణం కేవలం "ఫ్యాక్టరీల కొరత" మాత్రమే కాదు. ఇది భూగర్భ నిర్మాణం, ఇంధనంపై ఆధారపడటం, ఆర్థిక అంశాల కలయిక. భారతదేశం మరిన్ని యూరియా ప్లాంట్లను నిర్మించగలదు, నిర్మించింది కూడా. కానీ, నాణ్యమైన దేశీయ ఫాస్ఫేట్ రాక్‌ను గానీ, లేదా పొటాష్ నిల్వలు లేనిచోట వాటిని గానీ సులభంగా సృష్టించ లేదు. దానికి తోడు, నత్రజని ఎరువుల తయారీకి అధిక శక్తి (ఎనర్జీ) అవసరం మరియు ఇది ఎక్కువగా సహజ వాయువుపై ఆధారపడి ఉంటుంది. ఇందులో భారతదేశం ఇప్పటికీ గణనీయమైన వాటాను దిగుమతి చేసుకుంటోంది. పెట్రోలియం మంత్రిత్వ శాఖ చమురు, గ్యాస్ దిగుమతులను ఒక ప్రధాన ఆందోళనాంశం గా పదేపదే పేర్కొంది. దిగుమతులపై ఆధారపడిన భారతదేశం దేశీయ ఉత్పత్తిని పెంచాలని నొక్కి చెప్పింది.

స్వయం సమృద్ధి కష్టతరం కావడానికి మరో కారణం ఏమిటంటే, "ఎరువుల సబ్సిడీ విధానం". సబ్సిడీ ద్వారా రైతులకు ఎరువులను అందుబాటు ధరలో ఉంచడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. యూరియాపై రైతు ఇవ్వగలిగిన ధరను నియంత్రిస్తారు, ఉత్పత్తి/దిగుమతి వ్యయం, అమ్మకపు ధర మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది.

ఫాస్ఫేటిక్, పోటాష్ ఎరువుల విషయంలో, పోషకాధారిత సబ్సిడీ చట్టం కింద సబ్సిడీ రేట్లను సవరిస్తారు. ఇది రైతులకు సహాయపడుతుంది, కానీ అదే సమయంలో అమ్మోనియా, ఫాస్ఫారిక్ ఆమ్లం, సల్ఫర్, పొటాష్, రవాణా, మారకపు రేట్ల లోని ప్రపంచ ధరల హెచ్చు తగ్గులకు ఈ రంగం చాలా సున్నితంగా ఉంటుందని కూడా దీని అర్థం. రబీ 2025-26 కోసం డీఏపీ సబ్సిడీలో ఇటీవలి పెరుగుదల, అంతర్జాతీయ ముడిసరుకుల ధరల నుండి వస్తున్న ఈ ఒత్తిడినే కచ్చితంగా ప్రతిబింబిస్తుంది.

**రైతులకు యిచ్చే తక్షణ సందేశం**

మధ్యప్రాచ్య సంఘర్షణ సరఫరాలను యిబ్బందులకు గురిచేస్తూ, ఖర్చులను పెంచగలదు, ఎందుకంటే ఎరువుల ధర భారతదేశం దిగుమతి చేసుకున్న గ్యాస్, దిగుమతి చేసు

కున్న ముడి పదార్థాలు, దిగుమతి చేసుకున్న తుది ఎరువులపై ఆధారపడి ఉంది. అలానే ఇది ఒక విస్తృత స్థాయి సమస్య, కేవలం ఒక గ్రామం, ఒక డీలర్ లేదా ఒక ప్రభుత్వ శాఖ వల్ల కలిగేది కాదు.

**సమాధానం సహజ వ్యవసాయం**

అదే సమయంలో, ప్రస్తుత జాతీయ నిల్వలు సరిపోతున్నాయని, ముందుగా నిల్వ చేసుకోవడం, దీర్ఘకాలిక సేకరణ ఒక రక్షణ పొరను నిర్మించడంలో సహాయపడ్డాయని భారత ప్రభుత్వం పేర్కొంది. కాబట్టి, రైతులు స్పందించాల్సిన సరైన విధానం ఏంటంటే, భయపడటం లేదా నిందించు కోవడం కాదు, తెలివైన పోషక ప్రణాళిక, సాధ్యమైనంత వరకు బాహ్య ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం.

ఇక్కడే సహజ వ్యవసాయం , తక్కువ బాహ్య-ఉత్పత్తి పద్ధతులు అనేవి కేవలం సైద్ధాంతికంగానే కాకుండా, సాంకేతికంగా కూడా ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. ఒక గ్రామం నేలలోని సేంద్రియ పదార్థాన్ని మెరుగుపరచడం, పేడను ,జీవపదార్థాన్ని పునర్వినియోగించడం, జీవామృతం, కంపోస్టులు, పచ్చిరొట్ట ఎరువులు, పంట మార్పిడి, జీవ-ఉత్పత్తి పదార్థాలను ఉపయోగించడం ద్వారా ఎరువుల విషయంలో వెలుపలి తోడ్పాటు లేకుండా చేసుకోవచ్చు. కొనుగోలు చేసిన యూరియా, డీఏపీ పొటాష్‌పై ఎంత తక్కువగా ఆధారపడితే, బాహ్య, అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావం ఆ గ్రామంపై అంత తక్కువగా ఉంటుంది.

సహజ వ్యవసాయం రాత్రికి రాత్రే అన్ని పోషకాల అవసరాలను తొలగించదు. అయితే, కేవలం ప్రపంచ సరఫరా గొలుసులపై ఆధారపడిన పంటల పోషకాల సరఫరాను సహజ వ్యవసాయం తప్పక తగ్గించగలదు.

పంట ఆధారిత వ్యర్థాలను సరైన ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తిరిగి వ్యవసాయ పర్యావరణ వ్యవస్థకే మళ్లించడం ద్వారా ఇది ప్రపంచ సరఫరా గొలుసులపై ఆధారపడిన దుర్బలత్వాన్ని చాలావరకు తగ్గిస్తుంది. సేంద్రియ ఉత్పత్తి పదార్థాలు, పులియబెట్టిన సేంద్రియ ఎరువులు రైతుకు అందు బాటులోనే వున్నాయనే విషయాన్ని విస్మరించకూడదు సుమా! ■

## బిర్యానీ ఆకు సాగుతో భేషైన సంపాదన

**నే**టి కాలంలో చాలామంది సొంతంగా వ్యాపారం చేయాలనుకుంటున్నారు. కానీ డబ్బు లేక ఇతర కారణాల వల్ల అది కురట్లేదు. మీరు చాలా తక్కువ పెట్టుబడితో



పెద్ద మొత్తంలో సంపాదించ గల వ్యాపారంకోసం చూస్తు న్నట్లయితే బిర్యానీ ఆకు సాగు మీకు భేషైన ఆదాయ మార్గం అవుతుంది. బిర్యానీ ఆకును ఆంగ్లంలో బే లీఫ్ అంటారు. బిర్యానీ ఆకు సాగుకు మీరు ఒకసారి పెట్టుబడి పెట్టడం ద్వారా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించవచ్చు. బిర్యానీ మొక్కను ఒకసారి నాటితే, సంవత్సరాల తరబడి సంపాదించవచ్చు.

బిర్యానీ ఆకు సాగును వాణిజ్యీకరించడం ద్వారా విపరీతమైన లాభాలు పొందవచ్చు. తక్కువ శ్రమ, ఖర్చు తో ఈ సాగు చేయొచ్చు. బిర్యానీ ఆకుకు మార్కెట్లో విపరీత మైన డిమాండ్ ఉంది. బిర్యానీ ఆకు అమెరికా, యూరప్, దేశాలు, భారతదేశంలో ఎక్కువగా ఉపయోగి స్తుంటారు. దీనిని సూప్‌లు, నాన్‌వెజ్, వెజిటబుల్ డిష్‌లలో ఉపయోగి స్తారు. భారతదేశం, పాకిస్తాన్‌లలో దీనిని బిర్యానీ, ఇతర మసాలా వంటకాలలో గరం మసాలాగా ఉపయోగిస్తారు. ఇది మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇది చాలా దేశాల్లో ఉత్పత్తి అవుతుంది. దీని ప్రధాన ఉత్పత్తి దేశాలలో భారతదేశం, రష్యా, మధ్యఅమెరికా, ఇటలీ, ఫ్రాన్స్, ఉత్తర అమెరికా మరియు బెల్జియం ఉన్నాయి.

మీకు 5 ఎకరాల భూమి ఉంటే బే లీఫ్ సాగు సులభం గా ప్రారంభించవచ్చు. ఈ వ్యవసాయం చేయడానికి మీరు ప్రారంభంలో కొంత శ్రమ పడాలి. కానీ మొక్క పెరిగే కొద్దీ మీ శ్రమ తగ్గుతుంది. దీని సాగు ద్వారా ప్రతి సంవత్సరం మంచి ఆదాయాన్ని పొందవచ్చు. ■

# అకాల వర్షాలకు పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలు

ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు వివిధ పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలను అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారులు తెలియజేశారు. పంటల తీరుతెన్నుల విషయంలో పరిశీలించవలసిన అంశాలను, తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలను వారు వివరంగా తెలిపారు. ఆ వివరాలను తెలుసుకుందాం.

**వరి**

**పరిశీలనలు :**

- ♦ వరి పంట ప్రస్తుతం నాట్లు వేసిన 20–40 రోజుల దశలో ఉన్నది.
- ♦ ఈ జిల్లాలలో రైతులు ఆర్.ఎన్.ఆర్ –15048, కె.ఎన్.ఎం – 1638 మరియు బి.పి.టి 5204 రకాలను ఎక్కువగా సాగు చేశారు.
- ♦ సాధారణంగా ఈ రకాలు  -4 రోజుల వరకు ముంపును తట్టుకుంటాయి.
- ♦ ముంపుకు కొద్ది రోజుల ముందు ఎరువులు వేసిన వరి పొలాలలో నష్టం ఎక్కువగా ఉండే అవకాశం.
- ♦ 3–4 రోజుల వరకు మాత్రమే నీట మునిగిన పొలాలలో నష్ట తీవ్రత తక్కువగా ఉంటుంది.

**సూచనలు :**

- ♦ నీట మునిగే పొలాలు త్వరగా పుంజుకోవడానికి 5 సెంట్ల నారుమడికి 1 కిలో యూరియా +1 కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయాలి. తరువాత లీటరు నీటికి 2 గ్రా. కార్బెండిజం + మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి.
- ♦ పిలకలు కట్టే దశలో నీరు బయటకు తీసిన వెంటనే ఎకరాకు 20 కిలోల యూరియా +20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయడం వల్ల పంట త్వరగా పుంజుకుంటుంది మరియు నష్టం చాలావరకు తగ్గుతుంది.
- ♦ ఈ వాతావరణంలో ఆశించే తెగుళ్ళ నివారణకు లీటరు నీటికి 1 గ్రా. కార్బెండిజం లేక 2 గ్రా. కార్బెండిజం + మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి. డ్రోన్ లను ఉపయోగించడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేసే అవకాశం ఉన్నది.

**వేరుశనగ**

**పరిశీలనలు :**

- ♦ వేరుశనగ పంట ఏపుగా పెరిగే దశ (40 రోజులు) నుండి కోత దశ వరకు (100 రోజులు) వుంది.



- ♦ ఎక్కువ వేరుశనగ విస్తీర్ణం వున్న ప్రాంతాలైన రాయలసీమ జిల్లాలు మరియు నెల్లూరు మరియు ప్రకాశం జిల్లాలలో ప్రస్తుత వర్షాలు పంటలకు ప్రయోజనకరంగా ఉన్నాయి.
- ♦ ప్రధానమైన రకాలు కె–6, నారాయణి మరియు విశిష్ట రకాలు సాగులో వున్నాయి.
- ♦ బరువైన నేలల్లో పండే పంటలు ఏపుగా పెరిగే దశలో 2–3 రోజుల పాటు నీటి ముంపును తట్టుకోగలవు. తేలికపాటి నేలల్లో సాగు చేసిన పంటలకు ప్రస్తుత వర్షాల వల్ల ప్రతికూల ప్రభావం పడదు.

**సూచనలు :**

1. సాధ్యమైన చోట పొలాల నుండి అదనపు నీటిని వెంటనే తీసివేయాలి.

2. ఆకుమచ్చ తెగుళ్లను నియంత్రించడానికి టెబుకోనజోల్ (200 మి.లీ/ ఎకరాకు) లేదా హెక్సాకొనజోల్ 400 మి.లీ/ ఎకరాకు పిచికారీ చేయండి.
3. ఐరన్ లోపాన్ని సరిచేయడానికి ఫెర్రస్ సల్ఫేట్ 5 గ్రా/లీ తో పాటు సిట్రిక్ యాసిడ్ 1 గ్రా/లీ పిచికారీ చేయాలి.
4. పంట కోతకు సిద్ధంగా ఉన్న చోట వర్షాలు అగే ఎరకు పంట కోత ఆలస్యం చేయాలి

**మొక్కజొన్న**

**పరిశీలనలు :**

- మొక్కజొన్న పంట 50 నుండి 90 రోజుల దశలో ఉన్నది అంటే శాఖీయ. పూత, గింజ గట్టిపడు దశలలో ఉన్నది.
- అకాల వర్షాల వల్ల 48 గంటల్లో పొలాల్లో నిలిచిన నీరు బయటకు పోవడానికి అవకాశం ఉంది.
- రెండు రోజులకు మించి పొలాల్లో నీరు నిలిస్తే నష్టం తీవ్రత ఎక్కువగా ఉంటుంది
- మొక్కజొన్న పంట పుష్పించే దశలో ఉండి రెండు రోజుల పాటు నిరంతరాయంగా వర్షాలు కురిస్తే దిగుబడిపై ప్రభావం చూపుతుంది.
- మొక్కజొన్న పెరుగుదలకు తేలికపాటి వర్షము ప్రయోజనకరంగా ఉంది.

**సూచనలు :**

- ఎట్టి పరిస్థితుల్లోనూ 48 గంటల్లో పొలంలో నిలిచి పోయిన నీటిని తీసివేయాలి.
- ఎక్కువ కాలం పంట నీట మునిగితే దిగుబడిపై ప్రభావం చూపుతుంది.
- నిలిచిన నీటిని తీసివేసిన తర్వాత, పంటపై 2% యూరియా (10 కిలోలు / హెక్టార్) లేదా 1% పొటాషియం నైట్రేట్ (5 కిలోలు / హెక్టారు) పిచికారీ చేయడం వల్ల పంట త్వరగా కోలుకుంటుంది.
- నీటి ముంపు మరియు వాతావరణంలో అధిక తేమ కారణంగా వ్యాధులు (కాండం/పేరు తెగులు, గింజ బూజు తెగులు) రావడానికి అవకాశం ఉంది. కార్బెండజిమ్ 2-3 గ్రాములు లేదా మెటాలాక్సిల్ 35% డబ్ల్యు ఎస్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వీలు మరియు అవకాశాన్ని బట్టి, డ్రోన్ల సాయంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయడానికి వినియోగించవచ్చు.

**మినుము, పెసర**

**పరిశీలనలు :**

- మినుము మరియు పెసర పంటలు ఏపుగా పెరిగే దశ నుండి కాయ పరిపక్వ దశలలో ఉన్నాయి.

**సూచనలు :**

**పంట ఏపుగా పెరిగే దశ (శాఖీయ దశ):**

1. ప్రభావిత పొలాల్లో అధికంగా నిలిచిపోయ్యే నీటిని బయటకు తీయాలి.



2. ఇనుము లోపాన్ని సరి చేయడానికి మరియు సమర్థ వంతంగా పంట కోలుకోవడానికి ఫెర్రస్ సల్ఫేట్ ఏ 5.0 గ్రా ం సిట్రిక్ యాసిడ్ ఏ 0.5 గ్రా పిచికారీ చేయాలి. మరియు యూరియా ఏ 20 గ్రా లీటరుకు పిచికారీ చేయాలి.
3. ఒక వారం తర్వాత, 1% 19:19:19 లేదా 1-2% పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలి.
4. వేరుకుళ్లు తెగులు మరియు ఆకుమచ్చ వ్యాధులను నివారించడానికి హెక్సాకోనజోల్ 2 మి.లీ లేదా ప్రొపికోనజోల్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సాధించదగిన ఏ గొప్ప పనికీ దొడ్డిదారులు, అడ్డదారులు వుండవు ; రహదారులు తప్ప..

5. మరుకా కాయ తొలుచు పురుగు నివారణకు వర్షం కురిసిన వారం తర్వాత క్లోరైరిఫాస్ ఏ 2.5 మి.లీ/లీ లేదా నోవాల్యూరాన్ ఏ 1 మి.లీ/లీ నీటికి పిచికారీ చేయాలి.

**కాయ ఏర్పడే దశ నుంచి పరిపక్వ దశ:**

1. ప్రభావిత పొలాల్లో అధికంగా నిలిచిపోయ్యే నీటిని బయటకు తీయాలి.
2. వేరుకుళ్లు తెగులు మరియు ఆకుమచ్చ తెగుళ్లను నివారించడానికి హెక్సాకోనజోల్ 2మి.లీ లేదా ప్రొపి కోనజోల్ 1మి.లీ లీటరు నీటికికలిపి పిచికారీ చేయాలి.
3. మారుకా కాయ తొలుచు పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ/లీ లేదా నోవాల్యూరాన్ 1 మి.లీ / లీ నీటికి పిచికారీ చేయాలి.

**నువ్వులు**

1. వై ఎల్ ఎం – 66 మరియు వై ఎల్ ఎం – 146 రకాలు జిల్లాలో ఎక్కువగా సాగులో ఉన్నాయి
2. నువ్వులు ప్రస్తుతం కోత దశలో ఉన్నాయి. పొలంలో నిల్వ ఉన్న నీటిని తక్షణం బయటకు పంపించాలి (నీరు నిల్వ ఉండడం నువ్వులకు చాలా హానికరం).
3. పడిపోయిన మొక్కలను సావధానంగా నిలబెట్టాలి.
4. కోత సమయంలో జాగ్రత్తలు:

- పంటలో 70–80% కాయలు పసుపు/ఎండిన స్థితిలో ఉంటే వెంటనే కోత ప్రారంభించాలి.
- ఉదయం వేళల్లో కోత కోయడం మంచిది (కాయలు తక్కువగా రాలిపోతాయి).
- కోసిన మొక్కలను చిన్న కట్టలుగా కట్టి నిలువగా ఉంచాలి.
- ఎండబెట్టేటప్పుడు తార్పాలిస్ / ప్లాస్టిక్ షీట్‌పై ఉంచాలి.
- వర్షాల తర్వాత ఫంగల్ వ్యాధులు (ఆకు మచ్చలు. గింజ రంగు మారడం) వచ్చే అవకాశం ఉంటుంది. తడిసిన గింజలను వెంటనే ఎండబెట్టాలి. వర్షం తర్వాత 3–5 రోజులు బాగా ఎండబెట్టాలి. ■

## క్యాన్సర్ కారకాలు మన ఇళ్ళలోనే

**ఇం**టి బయటి క్యాన్సర్ కారకాల నుంచి తప్పించు కోలేం! కానీ ఇంటి లోపలి క్యాన్సర్ కారకాల నుంచి తప్పించుకోవచ్చు. కాబట్టి మన ఇళ్లలో తిష్ఠ వేసుకున్న ఆ కారకాలను వెతికి, వదిలించుకుందాం!

**ప్లాస్టిక్ డబ్బాలు:** ప్లాస్టిక్ వేడెక్కకుండా ఉన్నంత కాలం వాటితో ప్రమాదం ఉండదనుకుంటే పొరపాటు. కొన్ని ప్లాస్టిక్స్ చల్లగా ఉన్నా వాటిలోని బిస్ఫినాల్‌ఎ, థాలేట్స్‌ను విడుదల చేస్తూనే ఉంటాయి. హార్మోన్ల హెచ్చుతగ్గులకు కారణమయ్యే ఈ విషపూరిత రసాయనాలు దీర్ఘకాలంలో క్యాన్సర్లకు దారి తీస్తాయి

**నాన్ స్టిక్:** పాతవైనా, దెబ్బతిన్నవైనా వాటి పైపూతల నుంచి, పాలీఫ్లోరోఆల్కైల్ అనే ఫరెవర్ కెమికల్స్ విడుదల అవుతూనే ఉంటాయి. పాలీఫ్లోరోఆల్కైల్‌కు బహిర్గతమవడం వల్ల, మూత్రపిండాలు, వృషణాల క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది

**అల్యూమినియం ఫాయిల్:** ఆమ్లసహిత లేదా ఉప్పుతో కూడిన పదార్థాలతో కలిపి ఈ అల్యూమినియం ఫాయిల్‌ను తయారుచేస్తారు. అల్యూమినియం లీచింగ్‌కు దారి తీస్తుంది.

**రిఫైన్డ్ నూనెలు:** రిఫైన్డ్ నూనెలు వేడెక్కగానే, సులభంగా ఆక్సిడైజ్ అవుతాయి. దాంతో ఆల్డిహైడ్స్ అనే విషపూరిత సమ్మేళనాలు ఏర్పడతాయి. ఈ నూనెలతో, దీర్ఘకాలంలో క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది

**ప్లాస్టిక్ నీళ్ల సీసాలు:** వేసవిలో ప్రతి ఇంట్లో ఫ్రిజ్‌లో ఈ సీసాలు కనిపిస్తూనే ఉంటాయి. కానీ ఈ సీసాలు ఎండకు బహిర్గతమైతే బిస్ఫినాల్‌ఎతో పాటు సూక్ష్మప్లాస్టిక్స్, థాలేట్స్‌ను నీళ్లలోకి విడుదల చేస్తాయి. ఇవన్నీ హార్మోన్ల అవకతవకలకూ, క్యాన్సర్ ముప్పుకూ దారి తీస్తాయి.

**సెంటెడ్ క్యాండిల్స్:** ఇటీవలి కాలంలో ఈ పోకడ బాగా పెరిగింది. అయితే వీటి నుంచి బెంజీన్, టోలీన్ మొదలైన విష వాయువులు వెలువడతాయి. దీర్ఘకాలికంగా లుకేమియా ముప్పు పెరుగుతుంది. ■

# మామిడి మార్కెటింగ్ బృందానికి అవగాహన కార్యక్రమం

– డా.భార్గవి

2026 మామిడి సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని మార్కెటింగ్ ఎగ్జిక్యూషన్ టీమ్, ఎఫ్‌పీఓ నాయకత్వాన్ని సమన్వయం చేయడానికి ఒక సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో 11 ఎఫ్‌పిఓల నుండి 50 మంది రైతులు, 8 మంది సీఈఓలు పాల్గొన్నారు. ఏపీమాస్ నుంచి డా.భార్గవి, రమేష్ రెడ్డి, వి. పృధ్వీశ్వర్, సంతోష్ ఫెసిలిటేటర్లుగా పాల్గొన్నారు.



### పంట ప్రస్తుత స్థితి, పరిష్కారాలు

కార్యక్రమాన్ని డా. భార్గవి ప్రారంభించి, వి. పృధ్వీశ్వర్ సహకారంతో కొనసాగించారు. వివిధ రకాల మామిడి పంటల ప్రస్తుత స్థితిని విశ్లేషించారు. అలాగే రైతులు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలను గుర్తించి, వాటికి సాంకేతిక పరిష్కారాలను సూచించారు. పీక్ సీజన్‌కు ముందు ప్రమాదాలను తగ్గించే చర్యలపై దృష్టి పెట్టారు.

### వ్యూహాత్మక మార్కెటింగ్ ప్రణాళిక

వి. పృధ్వీశ్వర్ ఎఫ్‌పీఓ నెట్‌వర్క్ ద్వారా సమర్థవంతమైన మార్కెటింగ్ వ్యూహాన్ని వివరించారు. ఈ వ్యూహం 'మూడు స్థాయిల అమలు నమూనా' (త్రీ-ఫ్రేమ్ ఎగ్జిక్యూషన్ మోడల్)పై ఆధారపడి ఉంది:

- రైతు / బోర్డ్ స్థాయి: గ్రామీణ స్థాయిలో మద్దతు, భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం
- ఎఫ్‌పీఓ / సీఈఓ స్థాయి : నిర్వహణ, లాజిస్టిక్స్, నిర్ణయ ప్రక్రియను సమర్థవంతం చేయడం
- ఏపీమాస్ నిర్వాహక తోడ్పాటు: ప్రత్యేక మార్గదర్శకత్వం, అమలు పర్యవేక్షణ

### పోటీ సామర్థ్యం, ఆర్థిక ప్రయోజనం

ఈ శిక్షణలో రైతులకు విలువ ఆధారిత ప్రయోజనాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.

- స్థానిక వ్యాపారులు, మండీలతో పోలిస్తే ఎఫ్‌పీఓల ద్వారా వ్యాపారం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను స్పష్టంగా వివరించారు.
- ఖర్చు-లాభ విశ్లేషణ : ఎఫ్‌పీఓ మార్కెటింగ్ ద్వారా రైతులకు కలిగే లాభాలు, ఖర్చు తగ్గింపును సంఖ్యాత్మకంగా చూపించారు.

### పల్ప్‌పై దృష్టి

మధ్యాహ్న భోజనం అనంతరం, పల్ప్ మార్కెట్‌పై దృష్టి సారిస్తూ వ్యూహాత్మక చర్చ జరిగింది.

- పల్ప్ రకాల ఎంపిక : ప్రాసెసింగ్‌కు అనుకూలమైన మామిడి రకాలపై ప్రాధాన్యత ఇవ్వడం
- తదుపరి చర్యలు : సేకరణ (ప్రొక్యూర్‌మెంట్), మార్కెట్ లింకేజీల కోసం తక్షణ కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం.



■

అసలైన పరిష్కారం పైపై పొరలను తడిమితే రాదు ; మూలాన్ని ముట్టగలగాలి

# 'వాష్' పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం

సిరికొండ మండల కేంద్రంలోని మహిళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థాయి సిబ్బంది అయిన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ (వి ఓ ఏలు), ఓ బీ లకు నీరు, పారిశుధ్యం పరిశుభ్రత (వాష్) అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

ఈ శిక్షణలో సురక్షిత తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్యకరమైన జీవనశైలి, మరుగుదొడ్ల వినియోగం, ఇంటి పరిసరాల పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి ముఖ్య అంశాలపై విపులంగా చర్చ జరిగింది. మహిళా అభివృద్ధి సంస్థ తరపున వాష్ తెలంగాణ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ బ్రహ్మచారి పాల్గొని, సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల ప్రాముఖ్యతపై వివరించారు. మంచి నీటి మూలాల వినియోగం, చేతులు కడుక్కోవడం (హ్యాండ్ వాషింగ్) ప్రాముఖ్యత, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎలా అధిగమించాలో సూచనలు అందించారు.

జిల్లా ప్రాజెక్టు అధికారి మైత్రి ప్రవీణ్ మాట్లాడుతూ, గ్రామాల్లో శుభ్రతపై అవగాహన పెంపొందించడం వి ఓల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి కుటుంబానికి సమయానికి సరైన సమాచారం అందించడంతో పాటు, ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామస్థాయిలో అమలు చేయాలని, సంఘాల ద్వారా ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని ఏపీమాస్ ప్రతినిధులు సూచించారు.

ఏ పి ఎం కిరణ్ మాట్లాడుతూ, ప్రతి సంఘ సమావేశంలో వాష్ అంశాన్ని ఒక ముఖ్య అజెండాగా చేర్చి, ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వి ఓ ఏలు ఈ కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొంటూ, ఈ అంశాలను గ్రామస్థాయిలో అమలు చేసి కుటుంబాల ఆరోగ్యాన్ని మెరుగుపరచేందుకు కృషి చేస్తామని తెలిపారు. శిక్షణను నిర్వహించిన అధికారులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామారావు, రాజన్న, అనసూయ (సిసి లు), స్త్రీనిధి మేనేజర్, మండల సమాఖ్య పదాధికారులు పట్ల లక్ష్మి, మెస్రం.లక్ష్మి, కోశాధికారి నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు. ■

## మే 15 నుంచే ఖరీఫ్ సాగు

ఈ ఏడాది వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఖరీఫ్ సాగును మే 15 నుంచే మొదలు పెట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ అచ్చెన్నాయుడు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో 'రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చెన్న మాట్లాడుతూ.. 'రిజర్వాయర్లలో నీరు ఉన్న నేపథ్యంలో 2 నెలల ముందే సాగు మొదలు పెట్టాలి. దీనివల్ల అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకోవచ్చు. ఎల్‌నినో కారణంగా ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉంది. అందువల్ల నీటిని పొదుపుగా వినియోగించాలి. డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులపై అవగాహన కల్పించడానికి రైతన్న మీకోసం కార్యక్రమాన్ని చేపట్టాం' అని చెప్పారు. కృత్రిమ మేధ(ఏఐ), డ్రోన్ సాంకేతికత వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేస్తున్నామని చెప్పారు. రైతుల ఇళ్లకువెళ్లి, వారితో మాట్లాడి వ్యవసాయం, పండిస్తున్న పంటలు, సాగు పద్ధతులు, గిట్టుబాటు ధర తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నీటి భద్రత, పంటల ప్రణాళిక, ఆధునిక సాంకేతికత, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు వైవిధ్య పంటలు వేసి, సుస్థిర వ్యవసాయానికి బాటలు వేసి అధిక దిగుబడి, నికరాదాయం పొందాలని సూచించారు. ■

# టార్పాలిన్ల కొనుగోలుకు మేఘా సాయం!

– సాయి ప్రియాంక




**వ**ల్లమన్నాడ గ్రామానికి చెందిన అబ్దుల్ అజీజ్‌గారు వృద్ధాప్యంలో ఉన్న వ్యక్తి (73 సం॥). ఆయన కుటుంబం ఆర్థికంగా చాలా వెనుకబడి వుంది. వారి జీవనం భారంగా మారింది. ఒకప్పుడు ఆయన టైలరింగ్ పనే చేస్తూ జీవనాన్ని సాగించారు. కానీవయస్సు పెరగడంతో ఆయన మిషన్ కుట్టలేకపోతున్నారు. అందువల్ల కుటుంబానికి స్థిరమైన ఆదాయం లేక పేదరికంలో జీవించాల్సి వచ్చింది.

పి4 కార్యక్రమంలో భాగంగా ఆయన పేరు బంగారు కుటుంబాల జాబితాలో చేరింది. అప్పుడు యం ఇ ఐల్ సంస్థ వారి పరిస్థితిని గుర్తించి, వారి జీవనోపాధిని మెరుగుపరచడానికి టార్పాలిన్ల (పరదాలు) రూపంలో సహాయం అందించారు. ఆ సహాయంతో అజీజ్‌గారు చిన్న వ్యాపారం ప్రారంభించారు. వారు అక్కడి రైతులకు పరదాలు అద్దెకు ఇచ్చి తన జీవనోపాధిని మెరుగుపరుచుకుంటున్నారు. ఈ సహాయం వల్ల వారి ఆదాయం పెరిగింది. కేవలం ఒక వారంలోనే ఆయనకు 8,500 రూపాయలు ఆదాయం వచ్చింది. ప్రస్తుతం వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి కొంత మెరుగుపడింది. జీవనోపాధి స్థిరపడే దిశగా ఆయన ముందుకు సాగుతున్నారు.

సమయానికి అందిన చిన్న సహాయం కూడా ఒక కుటుంబ జీవితాన్ని మార్చగలదని యిది నిరూపిస్తుంది.

---

# నిర్మాణ కార్మికునికి పి4 చేయూత!

– వనజ



**చం**దా శివయ్యగారు కొతవరం గ్రామంలో అద్దె యింటిలోతన కుటుంబంతో నివసిస్తూ , తాపీ కూలీగా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. వారి కుటుంబంలో మొత్తం ముగ్గురు సభ్యులు ఉండగా వారందరి పోషణ పూర్తిగా ఆయన కూలీ పనుల మీద ఆధారపడి వున్నది.. సరిపడా ఆదాయం లేక వారి జీవితం దుర్భరంగా మారింది. సొంత ఇల్లు కూడా లేనందున యింటిఅద్దె , పిల్లల చదువులు, మొదలైన కుటుంబ ఖర్చులు పెరగడం, వచ్చే ఆదాయం తక్కువగా ఉండుట వలన కుటుంబ అవసరాలు తీర్చుకోవడంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యేవి.

ఈ పరిస్థితిని గమనించిన 'పి4' మెగా బృందం ఆయన జీవనోపాధిని మెరుగుపరిచేందుకు రూ. 45,000/– చేయూతను అందించింది. ఆ డబ్బుతో ఆయన "6 పిల్లర్ బాక్స్‌లు, రెండు రకాల మెషిన్లను కొనుగోలు చేశారు. వాటిని అద్దెకు ఇస్తూ , వాటి నుండి వచ్చే అద్దె ద్వారా వారి ఆదాయం మెరుగయ్యింది. ఫలితంగా ప్రస్తుతం తన కుటుంబాన్ని గౌరవంగా, స్వయం ఆధారంగా పోషించుకునే స్థితికి చేరుకున్నారు. ఈ సహాయం ద్వారా చందా శివయ్యగారి జీవన స్థాయిలో స్పష్టమైన మార్పు వచ్చి ఆర్థిక స్థిరత్వం వచ్చింది. ఇది పి4 ప్రాజెక్టు , మార్గదర్శక సంస్థ 'ఎం ఇ ఐ ఎల్ సంస్థ' తోడ్పాటుతో సాధించిన ఒక మంచి జీవనోపాధి అభివృద్ధి ఉదంతం! ■

కార్యాచరణ లేని అశయం పగటి కల ; ఆశయం లేని కార్యాచరణ పీడకల !

# సి ఎస్ వి పి మూల్యాంకన బృందం సందర్శన

**సి** ఆర్ ఐ డి ఎస్ నుంచి వచ్చిన ముగ్గురు సభ్యులతో కూడిన సి ఎస్ వి పి మూల్యాంకన బృందం 12-03-26 మధ్యాహ్నం గుడిబండకు చేరుకుంది. ప్రారంభంగా సుమారు అరగంట పాటు చర్చ జరిగింది. ఇందులో ప్రాజెక్ట్‌పై సమగ్ర ప్రజెంటేషన్‌ను పంచుకున్నారు.

అనంతరం ఈ బృందం పూజారిపల్లి గ్రామంలో క్షేత్ర పర్యటన చేసింది. అక్కడ ఇటీవల నిర్మించిన మినీ పర్కొలేషన్ ట్యాంక్ (యం పి టి)ను బృందం సందర్శించింది. ఒక రైతు పైప్ ద్వారా నీటిని ఈ ట్యాంక్‌లోకి పంపిస్తున్నాడు. ఈ చర్య ద్వారా సుమారు 10 బోర్‌వెల్స్‌కు నీరు అందడంతో పాటు దాదాపు 20 ఎకరాల భూమికి పంట భద్రత లభిస్తుంది.

ఈ ట్యాంక్ ముఖ్యంగా పశువులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంది. సుమారు 600-700 చిన్న మేత పశువులు (గొర్రెలు, మేకలు), సుమారు 100 ఎద్దులు/ ఆవులు ఈ ట్యాంక్ ద్వారా తాగునీటిని పొందుతున్నాయి. ఈ పశువులు ఉదయం, సాయంత్రం అడవులకు మేతకు వెళ్తాయి. తిరిగి వచ్చినప్పుడు ఈ ట్యాంక్‌నే ప్రధాన నీటి వనరుగా ఉపయోగిస్తాయి. సాయంత్రం మేత ముగించుకుని వచ్చిన గొర్రెలు, మేకలు నీరు తాగేందుకు పరుగులు తీస్తున్న దృశ్యాన్ని బృందం ప్రత్యక్షంగా గమనించింది.

తదుపరి సందర్శనలో వెర్మీ కంపోస్ట్ యూనిట్, సంప్రదాయ కంపోస్ట్ యూనిట్ మరియు అరెకనట్ పంటకు సంబంధించిన స్పర్ ఇరిగేషన్ విధానాన్ని సి ఎస్ వి పి మూల్యాంకన బృందం పరిశీలించింది. వెర్మీ కంపోస్ట్ యూనిట్లు, స్పర్ ఇరిగేషన్ విధానం చక్కగా అమలు జరుగుతుండడాన్ని బృందం గమనించింది.

అనంతరం, రాగి పంట పొలం, గ్రీన్ మ్యాన్యూరింగ్ ప్లాట్ , బయో-ఫెర్మెంటర్ యూనిట్‌ను మూల్యాంకన బృందం సందర్శించింది. ఈ యూనిట్‌ను సుమారు 10 మంది రైతులు సమర్థంగా వినియోగిస్తున్నారు.

సందర్శన మొత్తం సమయంలో మూల్యాంకన బృందం సంబంధిత అనేక ప్రశ్నలు అడిగి వివరణలు తీసుకున్నారు. ■

## పుట్టుమచ్చల్లో మార్పు చర్మక్యాన్సర్‌కు సంకేతం

**స్త్రీ** పురుషులు ఇద్దరూ, ప్రత్యేకించి పురుషులు క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం కోసం చేయించు కోవలసిన ముందస్తు పరీక్షలు కొన్ని ఉన్నాయి. చర్మ క్యాన్సర్, నోటి క్యాన్సర్, పెద్దపేగు, ప్రోస్టేట్ క్యాన్సర్లను వైద్య పరీక్షలతో ముందుగానే గుర్తించే వీలుంది.

**చర్మ క్యాన్సర్:** చర్మాన్ని తరచుగా పరిశీలించి ఈ క్యాన్సర్‌ను కనిపెట్టవచ్చు. ముఖ్యంగా పుట్టుమచ్చలను, ఎ, బి, సి, డి, ఇ పద్ధతి ప్రకారం పరీక్షించుకోవాలి.

**ఎ,బి,సి,డి,ఇ పద్ధతి!**

ఎ: పుట్టుమచ్చలను మధ్యకు విడదీసి చూసినప్పుడు అవి రెండు అర్థభాగాలుగా కనిపించకూడదు.

బి: పుట్టుమచ్చల అంచులు గరుకుగా, అస్పష్టంగా ఉండకూడదు.

సి: పుట్టుమచ్చ రంగులో మార్పు రాకూడదు. అవి ముదురు రంగులోకి మారడం, పలుచబడటం సరికాదు.

డి: పుట్టుమచ్చ వ్యాసం 1/4 అంగుళం కన్నా ఎక్కువ ఉండకూడదు

ఇ: పుట్టుమచ్చ చర్మం మీద ఉబ్బెత్తుగా, వాచినట్టు ఉండకూడదు.

**నోటి క్యాన్సర్**

నోటి క్యాన్సర్ ఎక్కువగా ఉన్న మనలాంటి దేశాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ అనేది ఎంతో ముఖ్యం. మిగతా శరీర భాగాల్లా కాకుండా నోరు అనేది కంటికి కనపడేది. కాబట్టి ప్రాథమిక స్క్రీనింగ్ అనేది సులువు. నోట్లో తలెత్తే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ■

# తెలుగు రైతమ్మల సాటిలేని సాగు తీరు!

**మ**హిళలను భూమాతతో పోల్చుతారు. అయితే భూమాత పచ్చగా మారి, ప్రపంచానికి ఆహారాన్ని అందిస్తోం దంటే... ఆ కృషిలో మహిళా భాగస్వామ్యాన్ని మర్చిపోరాదు. అందుకే ఐక్యరాజ్య సమితి 2026ను 'మహిళా రైతుల సంవత్సరం'గా ప్రకటించింది. ఇది ప్రపంచ వ్యవసాయ చరిత్రలో ఒక కీలకమైన మలుపు. పొలాల్లో విత్తనాలు చల్లటం నుంచి, కుటుంబాన్ని నడిపించే దాకా... వ్యవసాయ రంగాన్ని నిశ్శబ్దంగా మోస్తున్న ఎందరో రైతమ్మల కృషికి లభించిన అంతర్జాతీయ గుర్తింపు ఇది.

**ఆదివాసీ వరికి రక్షణ**

ఆంధ్రప్రదేశ్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు మండలం సొవ్వ, కరకవలస గ్రామాల్లో 45 మంది మహిళా రైతులు... 13 పురాతన దేశీయ వరి రకాలను సాగు చేయడంతో పాటు, కరకవలస గ్రామంలో గెడ్డ వాగు వరదలకు మునిగిపోకుండా తట్టుకునే 4 నుంచి 6 అడుగుల వరకు పెరిగే దేశీయ వరిని సాగు చేస్తున్నారు. ఇక్కడి కుటుంబాలకు ఎకరం నుంచి రెండు ఎకరాలకు మించి ఉండదు.



"ఇవి దేవుడు ఇచ్చిన ధాన్యపు రకాలు అని మా నమ్మకం. బస్నా సోఫ్వూర్, బుడమ ధాన్యం, దేశీ పెద్దధాన్యం, దేశీ రాజముడి, ఎర్ర ధాన్యం, గుడుం ధాన్యం, ఇసుకరవ్వలు, జోజోర్కి ధాన్యం, మాస్టర్ ధాన్యం, నల్ల ధాన్యం, పసుపు సన్నాలు, సోర్ ధాన్యం, తేటం ధాన్యం ఇలా 13 రకాలు పండిస్తున్నాం.

ఇవన్నీ మా పూర్వీకులు ఎప్పుడో పండించినవే, మేము వాటిని కాపాడుకుంటున్నాం' అంటున్నారు లకోయి సుమతి. ఈ దేశీయ వరి రకాలను శుద్ధి చేసి (వేరే రకాలు కలవకుండా), వాటి ఉత్పత్తిని పెంచడానికి కరకవలస గ్రామంలో బయోడైవర్సిటీ బ్లాక్‌లను గ్రామస్తులంతా ఏర్పాటు చేసుకున్నారు. ఈ పురాతన వరి వంగడాల విలువను గుర్తించిన వాసన్, వికాస స్వచ్ఛంద సంస్థలు ఈ మహిళా రైతుల నుంచి ప్రతీ రకానికి 500 కిలోల చొప్పున సేకరించి విత్తనాల అభివృద్ధికి, ఇతర ప్రాంతాలకు ఈ బియ్యాన్ని మార్కెటింగ్ చేసి ఆదివాసీల ఆదాయం పెంచడానికి కృషి చేస్తున్నాయి. స్థానిక వరి రకాలకు అధిక డిమాండ్ ఉంది. పర్యాటకులు అరకు లోయలోని దుకాణాల నుంచి కిలోకు రూ.80 చొప్పున చెల్లించి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

**కాయగూరలు, పండ్లకు కొత్త జీవం**

తూర్పు కనుమల ప్రాంతం. పనస, పైనాపిల్, మామిడి వంటి పండ్లకు పెట్టింది పేరు. కానీ మార్కెట్ లేని రోజుల్లో అదే పంట రోడ్ల పక్కన పారేస్తున్న దృశ్యాలు రమణమ్మ మనసును కలిచివేశాయి. ఆమె ఒక వ్యవసాయ కూలీ. అనకాపల్లి జిల్లాలోని చోడవరానికి చెందిన ఆమె, బాల్యం నుంచే పేదరికంతో పోరాడుతూ వ్యవసాయ పనులు చేస్తూనే డిగ్రీ పూర్తి చేసింది. తమ ప్రాంతంలోని గిరిజన రైతులు నష్టపోతున్న తీరును చూసి ఊరుకోలేక, మాడుగుల సమీపంలోని 'వికాస వనం'లో చేరింది. అక్కడ కొన్ని సంస్థల సహకారంతో ఎకరం విస్తీర్ణంలో సోలార్ డ్రైయర్లు ఏర్పాటు చేసి కాయగూరలు, పండ్లకు కొత్త జీవం పోసింది. కొండ ప్రాంతాల్లో పండే పైనాపిల్, మామిడి, పనస, అరటి, సపోట వంటి సీజనల్ ఫ్రూట్స్‌ను ముక్కలుగా చేసి, డ్రై చేసి అన్‌సీజన్‌లోనూ అందుబాటులో ఉంచుతూ ఎగుమతులు మొదలుపెట్టింది. అల్లం, మునగాకు, కరివేపాకు, ఉసిరి పొడులు కూడా ఇక్కడే తయారవుతున్నాయి.



"అల్లం పొడి కూరల్లో, టీలో వేస్తారు. మ్యాంగో పొడి పులిహార, కూరల్లో ఎక్కువగా అడుగుతున్నారు. ఉసిరి పొడికీ మంచి డిమాండ్ ఉంది. పనస, అరటి డ్రైడ్ ఫ్రూట్స్‌ను ఐస్‌క్రీమ్ కంపెనీలు కోరుతున్నాయి," అని రమణమ్మ చెబుతుంది. ఈ కృషిని గుర్తించిన హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ పండ్లు నిల్వ ఉండేందుకు కోల్డ్ స్టోరేజీ రూమ్ ఏర్పాటు చేసింది. ఫలితంగా రమణమ్మతో పాటు నలుగురు మహిళలకు ఉపాధి, రైతులకు నష్టాల తగ్గింపు, అన్‌సీజన్ లోనూ పండ్ల లభ్యత. అధిక దిగుబడి వచ్చినప్పుడు పంటను విలువ ఆధారిత ఉత్పత్తిగా మార్చి లాభాలు పొందే మార్గం చూపింది. తూర్పు కనుమల్లో రమణమ్మ వెలిగించిన ఈ చిన్న దీపమే, పెద్ద మార్పునకు వెలుగుబాటగా మారింది.

**టమాటా నష్టాలకు చెక్... భారతమ్మ ఐడియా!**

టమాటా.... ఒక సీజన్‌లో కిలోకి వంద రూపాయలు ఉంటుంది... ఇంకో సీజన్‌లో కిలోకి రూపాయి కూడా ధర పలకదు! ప్రతీ సీజన్‌లోనూ పత్రికల్లో దీని ధర ఒక తప్పనిసరి వార్త! ఇలాంటి వార్తలను బ్రేక్ చేసిన రైతు భారతమ్మ. రాయలసీమ ప్రాంతంలో రైతులకు టమాటా సాగు ప్రతి ఏటా ఒక ప్రశ్నగానే ఉంటుంది. మార్కెట్ ధరలలో తీవ్రమైన తేడాలే దానికి కారణం. ఇలాంటి పరిస్థితిలో అనంతపురం జిల్లా, బండ్రేపల్లి గ్రామా నికి చెందిన భారతమ్మ ఒక పరిష్కారం చూపారు. కేవలం టమాటా మాత్రమే కాకుండా, దాంతో పాటు మరికొన్ని అంతర పంటలను కలిపి సాగు చేసే 'పాలీ క్రాపింగ్' మోడల్స్‌ని ఆమె అమలు చేశారు.



"టమాటాతో పాటు కూరగాయలు, ఆకుకూరలను మిశ్రమ పద్ధతిలో అంతర పంటలుగా వేయడం, ఏడాది పొడవునా పెరిగే కొన్ని తీగ జాతి పంటలు కలిపి వేయడం, ఇలా రకరకాల ప్రయోగాలు చేశాను. మార్కెట్ ధరల వల్ల కలిగే రిస్కు తగ్గించడం, అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం అందేలా చూడటం... ఈ మోడల్స్ ఉద్దేశం. గత మూడేళ్లుగా ఈ విధానం పాటిస్తున్నాను. టమాటా వల్ల ఇప్పటి వరకు నష్టపోలేదు' అంటోంది భారతమ్మ. ఆమె సహజ వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నారు, ఆమెను ఆదర్శంగా తీసుకొని 8 మంది రైతులతో మొదలైన ఈ పాలీక్రాప్ విధానం ఇవ్వాళ 250 మంది రైతులకు చేరింది. శ్రీసత్య సాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలలో దాదాపు 96.50 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం ప్రధాన పంట టమాటాను మరికొన్ని అంతర పంటలతో కలిపి సాగు చేస్తున్నారు.

**మంచు బిందువులతో 25 రకాల పంటలు**

"నాకు ముగ్గురు బిడ్డలు. డెలివరీకి ఏ ఆసుపత్రికీ వెళ్లలేదు. ఇంట్లోనే నార్మల్ డెలివరీ అయింది. ఇప్పటిదాకా మా కుటుంబానికి డాక్టర్ ఎలా ఉంటారో తెలీదు. ఒక్క టాబ్లెట్ కూడా వేసుకోలేదు. మేమే కాదు మా ఊరంతా అంతే ఆరోగ్యంగా ఉంటారు. ఇదంతా మా ప్రకృతి పంటల మహిమ" అన్నారు వినోద. ఆమెకు నాగ్వర్ గ్రామంలో (న్యాల్‌కల్ మండలం, సంగారెడ్డి జిల్లా) రెండు ఎకరాలుంది. దానిలో 25 రకాల చిరుధాన్యాలు పండిస్తున్నారు. "మాకు నీటి వసతి లేదు. వర్షాధార సాగు. మా అత్తమ్మల ద్వారా చిరుధాన్యాల పంటలసాగు నేర్చుకున్నాం. మంచు కురిసే సీజన్‌లో కొన్ని పంటలు ఆ తేమకే పండుతాయి. జొన్నల్లో 4 రకాలు, రాగులు, సజ్జలు, కొర్రల్లో అయిదేసి రకాలు... ఇలా ఏడాదంతా ఏదో ఒక పంట పండిస్తాం. నెలకో పంట దిగుబడి వస్తుంది. ముందు కుటుంబ అవసరాలకు ఉంచుకున్న తరువాత మిగిలిన పంటనే అమ్ముకుంటాం" అంటారామె. విత్తనాలు, ఎరువులు సొంతంగా తయారు చేసుకుంటారు తప్ప బయట నుంచి



ఒక్కటి కూడా కొనరు. ఈ ఊరిలో ఎరువుల షాపులుండవు. అన్ని ఖర్చులు పోనూ ఎకరానికి లక్షన్నరకు పైగా లాభం వస్తుందన్నారు వినోద.

**చిరుధాన్యాలతో సిరులు**

వాతావరణ మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో చాలా తక్కువ నీటితో పండే చిరుధాన్యాల సాగును విస్తృతంగా చేపట్టడం మేలని వ్యవసాయ శాస్త్రవేత్తలంటారు. వీటికి కరువు పొంతాలే అనుకూలం. అయితే మిల్లెట్స్ సాగులో రైతులు ముందుకు వచ్చినప్పటికీ, వాటి ప్రాసెసింగ్‌లో ఉన్న క్లిష్టత, వాటి వినియోగం తగ్గడానికి రైతులు నష్టపోవడానికి కారణం అయ్యింది. ఈ సమస్యకు కొత్త పరిష్కారం చూపారు కొందరు మహిళలు. చిరుధాన్యాల పోషక విలువలు కోల్పోకుండా వాటి పొట్టుతీయడానికి అవసరమైన యంత్రాలను ఏర్పాటు చేసి, మిల్లెట్స్‌ని పునర్వినియోగంలోకి తేవడానికి కృషి చేస్తున్నారు. ఇప్పుడు అన్ని రకాల మిల్లెట్స్‌ని ఆధునిక యంత్రాలపై ప్రాసెస్ చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా మామిడిపాలెంలో ఏర్పాటయ్యింది 'మన్యం గ్రెయిన్స్'. ఊరి మధ్యనే 'మన్యం గ్రెయిన్స్' ఫ్యాక్టరీ పెట్టి, చిరుధాన్యాలతో సేమియా, ఇడ్లీ, దోసె పిండి తయారు చేసి ప్యాకింగ్ చేస్తున్నారు. 'మన్యం గ్రెయిన్స్' మహిళల కృషి వల్ల ఏజెన్సీ రైతుల కష్టానికి తగిన గిట్టుబాటు ధర లభించింది. మామిడిపాలెం చుట్టుపక్కల గ్రామాల రైతులు కూడా చిరుధాన్యాలు పండించుకొని ఇక్కడే ప్రాసెస్ చేయించుకొని లాభాలు పొందుతున్నారు. ఈ మిల్లెట్స్ మిల్, రెస్టారెంట్ వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా రెండొందలకు పైగా మహిళలకు ఉపాధి దొరికింది. వర్షాధార భూముల్లో అరుదైన సంపదను సృష్టించి, గ్రామీణ ఎకానమీని మార్చారు.

**పశుగ్రాస ప్రయోగంతో పాల వెల్లువ**

అక్కడ మేత లేక పశువులు విలవిల్లాడేవి. సుదూర ప్రాంతాలైన శ్రీకాళహస్తి, రాయచోటి నుంచి పశుగ్రాసం తెప్పించుకోవాల్సి వచ్చేది. ఆర్థిక భారం తట్టుకోలేని రైతులు పశువులను చౌకగా అమ్మేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలాంటి స్థితిలో ఒక మహిళా రైతు పంటపొలాల్లో చేసిన చిన్న ప్రయోగం వీరిని సమస్యల నుంచి బయటపడేలా చేసి... పాల ఉత్పత్తిని పెంచింది.

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో అయ్యవారిపల్లికి చెందిన హేమలత పశుగ్రాసం కష్టాల నుంచి పాడి రైతులను గట్టెక్కించడానికి, భిన్నమైన సేద్యం చేస్తున్నారు. తనకున్న రెండు ఎకరాల్లో ఒక ఎకరంలో కూర గాయలు వేసి మరో ఎకరంలో



పశుగ్రాసం పెంచుతున్నారు. అయితే ఒకేరకం పశుగ్రాసం కాకుండా మల్టీ స్పీషీస్ ఫోడర్‌ని పెంచడం మొదలు పెట్టారు.

"మా ప్రాంతంలో తక్కువ వర్షపాతం, ఎండ తీవ్రత ఎక్కువ. తీవ్రమైన నీటి కొరత ఉంది. అందుకే ఇక్కడ ఎండను తట్టుకునే, తక్కువ నీటితో పెరిగే, పోషక విలువలు ఉన్న పంటల కలయిక చాలా ముఖ్యం అని తెలుసుకున్నాను. ఎప్పుడూ ఒకేరకం ఆహారంతో మనుషులు విసిగిపోయినట్టే పశువులు కూడా ఉంటాయి. వాటికి భిన్నమైన రుచులు అవసరం. అందుకే అలసందలు, సజ్జ, జొన్న, ఉలవలు, రాగులు, పప్పుధాన్యాల విత్తనాలన్నీ కలిపి పండిస్తున్నాను. పంట బాగా ఎదిగిన తరువాత ఈ మల్టీ స్పీషీస్ ఫోడర్‌ని పశువులకు వేస్తుంటే చాలా ఇష్టంగా తింటున్నాయి. కార్బొహైడ్రేట్‌లు, ప్రొటీన్, ఖనిజాలు సమానంగా లభిస్తుండటంతో పాల ఉత్పత్తి పెరిగింది. అన్నింటికన్నా ముఖ్యంగా పశువుల ఆరోగ్యం మెరుగుపడింది.' అన్నారు హేమలత.

ఈ మహిళా రైతు పశుగ్రాస ప్రయోగం సక్సెస్ అవ్వడంతో మిగతా రైతులంతా గ్రామసభలు నిర్వహించి అందరి సమన్వయంతో బహుళపంటల పశుగ్రాసం పెంపకం చేపట్టారు. గతంలో ఆ ఊరిలో 200 లీటర్ల పాలు సేకరించడం కూడా కష్టంగా ఉండేది. నేడు

వెయ్యి లీటర్లకు పైగా పాలు సేకరిస్తున్నారు. ఒకప్పుడు పశుగ్రాసం కోసం నానా కష్టాలు పడిన రైతులు నేడు చుట్టుపక్కల గ్రామాలకు కూడా మేతను సరఫరా చేసే స్థాయికి ఎదిగారు.

**బీడు భూముల్లో ఆత్మవిశ్వాసమే తోడుగా...**

దట్టమైన అడవి, గుహలు, కొండలతో తెలంగాణ–చత్తీస్‌గఢ్ మధ్య విస్తరించిన సహజ సుందరమైన ప్రాంతం కర్రెగుట్టలు. ఒకవైపు సాయుధ దళాలు మరోవైపు మావోయిస్టుల కదలికల మధ్య ఎవుసం చేయడానికి రైతులు వెనుకాడుతున్న సమయంలో 150 మంది మహిళలు కొంగు బిగించి పొలాల్లోకి అడుగు పెట్టారు. ములుగు జిల్లా, వెంకటాపురం మండలంలో ఒకప్పుడు అన్నీ బీడు భూములే.



అక్కడి గిరిజనులకు చిన్న కమతాలు ఉన్నప్పటికీ సాగుకి అనువుగా లేక మగాళ్లు పట్టణాలకు వలసలు వెళ్లేవారం. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో అక్కడకు వనసమాఖ్య అనే స్వచ్ఛంద సంస్థ బీడు భూములకు నీటి వసతి కల్పించి, భూసారం పెంచి సాగుకు అనువుగా మార్చింది.

150 ఎకరాలకు సరిపడా మామిడి మొక్కలిచ్చారు. వాటి నిర్వహణకు మహిళా రైతులు గ్రామాభివృద్ధి కమిటీగా ఏర్పడి ముందుకు వచ్చారు.

‘మామిడి తోటల మధ్య వాటర్‌మెలన్ సాగు మొదలు పెట్టాం. ఎకరానికి 20 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టాం. పూర్తిగా ఆర్గానిక్ విధానంలో పండిస్తున్నాం. ఏడాదికి రెండు పంటల తీస్తున్నాం. ఎకరానికి 2 నుంచి 3 లక్షల వరకు ఆదాయం వస్తోంది’ అని తిప్పాపురానికి చెందిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యురాలు మిడియం నాగమణి అన్నారు.

**సముద్రాన్ని వెనక్కి నెట్టారు..**

సముద్రం, ఊర్లు... ఈ రెండింటి మధ్య సహజమైన వంతెనలుగా నిలిచే మడ అడవులు ఈ రోజు కీలకశక్తిగా మారాయి. తుఫాన్లు, సునామీలు, వరదల సమయంలో తీరాన్ని కోతకు గురికాకుండా అడ్డుకునే రక్షణ కవచాలివి. కానీ ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. గత శతాబ్దం చివరికి ప్రపంచంలో ఉన్న మడ అడవుల్లో సగానికి పైగా విస్తీర్ణం నశించిందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదే సమస్య వల్ల ఆంధ్రప్రదేశ్, కృష్ణా డెల్టా ప్రాంతంలో వ్యవసాయం, చేపల వేట మీద ఆధారపడే లక్షలాది కుటుంబాల జీవితం తరచూ వచ్చే తుఫాన్లు, వరదలతో సంక్షోభంలో పడింది.

దీనికి పరిష్కారంగా మడ అడవుల పునరుద్ధరణకు మహిళలే ముందుకు వచ్చారు. కృష్ణా జిల్లాలోని సొర్లగొంది, నాలి, బసవనిపాలెం గ్రామాల్లో స్థానిక మహిళల భాగస్వామ్యంతో 200 హెక్టార్ల విస్తీర్ణంలో మడ అడవుల పునరుద్ధరణ స్వామినాథన్ ఫౌండేషన్ సహకారంతో ప్రారంభమైంది.



ఇది కేవలం మొక్కలు నాటే కార్యక్రమం కాదు. వాతావరణ మార్పులకు ఎదురొడ్డి నిలబడే గ్రామాల సామర్థ్యాన్ని పెంచిన ఉద్యమం. ఇక్కడి మహిళలు మరో అడుగు ముందుకేశారు. సముద్రపు బ్యాక్ వాటర్‌ను చిన్న మడుల్లోకి మళ్లించి చేపలు, పీతల పెంపకం చేపట్టారు. ఫలితంగా తీరానికి రక్షణ, మత్స్య సంపద పెరుగుదలతో స్థిరమైన ఆదాయం ఈ రెండు కలిసి గ్రామాల్లో కొత్త ఆశను నింపాయి.

“మడ అడవులు కేవలం చెట్లు కాదు.. అవి తీర ప్రాంతాల రక్షణ కవచాలు... ఇప్పుడు ఊరంతా ధైర్యంగా ఉంది” అన్నారు పద్మ. ఇదంతా మహిళా సంకల్పమే ! ■

తనకు మించిన పని తలకెత్తుకున్నారనేదానికి తొందరపాటే నిదర్శనం

# వరిలో తెగుళ్ళ బెడద : ఆందోళనలో రైతులు

ప్రస్తుతం వరిలో తెగుళ్ల బెడద రైతులను ఆందోళన రేకెత్తిస్తోంది. వరిపైర్లన్నీ పాలుపోసుకునే దశలో ఉన్నాయి. వరి కంకులన్నీ ధాన్యపు గింజలుగా మారే తరుణంలో పలు చోట్ల పంటలకు చీడ పీడలు, తెగుళ్లు సోకాయి. ఈ నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుని పంట నష్టపోకుండా చూసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వరి పొలాల్లో మొగి పురుగు, కంకినల్లి ఉధృతి కొనసాగుతోంది. మరికొద్ది రోజుల్లో మెడ విరుపు, దోమపోటు కూడా సోకే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో రైతుల కోసం పలు సూచనలు..

**కంకినల్లి..**

వరి పైరులో రైతులు కంకినల్లి లక్షణాలను గుర్తించవచ్చు. వరి ఆకుల తొడిమ మీద గోధుమరంగు గీతలు కనిపిస్తాయి. ఆకుతొడిమ తెరిస్తే చిన్న, తెల్లటి నల్లిలాంటి పురుగులు కనిపిస్తాయి. నల్లి ఆశించిన కంకిలో గింజలు నల్లబడిపోయి తాలుగా మారుతాయి.

వరిలో కంకి ఏర్పడే ప్రస్తుత దశలోనే లీటర్ నీటికి స్పైరోమెసిఫెన్ 1 మిలీ లీటర్ మందును కలిపి పిచికారి చేయాలి. లేదా దయాఫెన్థయూరన్ 50 ఒక గ్రాము పొడి మందు లీటరు నీటికి కలిపి పిచికారి చేసి కంకినల్లిని నివారించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మరిన్ని సూచనలకు వ్యవసాయ అధికారిని కలిసి నివారణ చర్యలు చేపట్టవచ్చు.

**మొగిపురుగు..**

వరి ఆకుల మీద మగ పురుగు గుడ్లు పెడుతుంది. గుడ్డు కాస్త 15 రోజుల్లో సన్నని బియ్యం మాదిరిగా పురుగుగా మారుతుంది. వరి కాండం మొదట్లో మొగి పురుగు చొరబడి అందులోని గుజ్జును తింటుంది. కాండం నుంచి వరి కంకికి పత్రహరితం సరఫరా కాక వరి కంకి తెల్లబడిపోయి తాలుగా మారుతుంది. 30 శాతం నుంచి 40 శాతం వరకు పంట నష్టం జరుగుతుంది. మొగిపురుగు నివారణకు కాంటాఫ్ హైడ్రో క్లోరైడ్ 50సి మందును ఎకరానికి 300 గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలి. దీంతోపాటు వేపనూనెను కలిపి పిచికారి చేస్తే మంచి ఫలితంఉంటుంది.

**మెడవిరుపు..**

వరి కంకి పాలు పోసుకునే దశలో కంకి వెన్నుదగ్గర నల్లని శిలీంధ్రం ఏర్పడి పత్రహరితాన్ని వరి గొలుసుకు సరఫరా కాకుండా నిలిచిపోతుంది. తద్వారా వరి గొలుసు విరిగిపోయి తాలుగా మారుతుంది. పంటనష్టం భారీగా జరుగుతుంది. మెడవిరుపు నివారణకు కాసుగామైసిన్ మందును ఎకరానికి 400 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారిచేసుకోవాలి.

**దోమపోటు..**

వరి కాండం మొదట్లో గోధుమ, తెలుపురంగులో ఉండే రసం పీల్చే పురుగులు ఉంటే దోమపోటుగా గుర్తించవచ్చు. దీనిని రైతులు వెంటనే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. దోమపోటు సోకిన పొలం నుంచి కాలువల ద్వారా నీటిని తీసివేయాలి. పొలాన్ని వీలైనంత ఆరబెట్టాలి. దోమపోటు సోకిన తర్వాత వరికాండం నుంచి గొలుసుకు పత్రహరితం సరఫరా కాక ధాన్యపు గింజలు తాలుగా మారుతాయి.

పురుగులు వరికాండం వద్ద రసం పీల్చిన తర్వాత వరి కంకులు ఎండిపోతాయి. వీటి నివారణకు పైమెట్రోజిన్ 50శాతం మందు ఎకరానికి 120 గ్రాముల చొప్పున ఉదయం లేదా సాయంత్రం పిచికారి చేసుకోవాలి. సరైన సమయంలో రైతులు ఈ తెగుళ్లను గుర్తించి పంట నష్టపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.


(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

# ప్రాణాంతకమైన గడ్డిమందు పారాక్వాట్ !

అత్యంత విషపూరితమైన (హై అక్యూట్ టాక్సిసిటీ) గడ్డి/కలుపు మందు పారాక్వాట్‌ను నిషేధించాలన్న డిమాండ్ ఊపందుకుంది. దీన్ని 9 పంటల్లో గడ్డి/కలుపు నివారణకు వినియోగించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే, 25 పంటల్లో దీన్ని తెలిసో తెలియకో వాడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ మందును చల్లేటప్పుడు జాగ్రత్తలు తగిన రీతిలో తీసుకోకపోవటం వల్ల రైతులు, రైతుకూలీలు ఆ విషప్రభావానికి తీవ్రఅస్వస్థతకు గురై చనిపోతున్నారు.

ఈ ప్రమాదకరమైన రసాయనం గాలి ద్వారా పీల్చినా, క్షణికావేశంలో తాగినా, దీన్ని చల్లిన నేలపై నడిచేటప్పుడు ముల్లు గుచ్చుకున్నా శరీరం విషపూరితమవుతుంది. ఊపిరితిత్తులు, మూత్ర పిండాలు, గుండె దెబ్బ తింటాయి. దీని ప్రభావాన్ని అడ్డుకోవటానికి ఇప్పటి వరకు విరుగుడు చికిత్స అందుబాటులో లేదు. ఈ కారణంగా పారాక్వాట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిషేధించాలన్న డిమాండ్ నానాటికీ బలపడుతోంది.




ఇండియన్ మెడికల్ అసోసియేషన్, డాక్టర్స్ ఎగెనెస్ట్ పారాక్వాట్ పాయిజన్ సంస్థలు సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్‌లో పలువురు పాల్గొని నిషేధం కోసం పోరాడతామన్నారు. ఇప్పటికే ఒడిషా, కేరళ రాష్ట్రాల్లో నిషేధించారు. తెలుగు రాష్ట్రాల్లోనూ నిషేధించాల్సిన అవసరం ఉంది. పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ ఇండియా కొన్ని సంవత్సరాల క్రితమే రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి నిషేధించాలని కోరింది. ఈ నేపథ్యంలో అసలు పారాక్వాట్ కలుపు/గడ్డి మందు పూర్వాపరాలేమిటో తరచి చూద్దాం...

పారాక్వాట్ డైక్లోరైడ్.. నాన్-సెలెక్టివ్ కాంటాక్ట్ హెర్బిసైడ్. అంటే.. ఏదో ఒక రకం కలుపు మొక్కనో లేదా ఏవో కొన్ని రకాల కలుపు మొక్కల్నో నిర్మూలించడానికి ఉద్దేశించింది కాదు. ఇది తాకిన అన్ని ఆకుపచ్చ మొక్కల కణజాలాలను చంపుతుంది లేదా దెబ్బ తీస్తుంది. వేగంగా పని చేసే రసాయనం. ఇలాంటి కలుపు మందులు

### పారాక్వాట్ పై నిషేధానికి తెలంగాణా అసెంబ్లీ తీర్మానం

ప్రమాదకరమైన పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుపై నిషేధం విధించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ శాసనసభలో 2026 మార్చి 30న ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. పారాక్వాట్ తయారీ, దిగుమతి, నిల్వ, రవాణా, విక్రయం, వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ప్రజారోగ్యానికి ముప్పు: ఈ మందు అత్యంత విషపూరితమైనదని, ఇది వాడడం వల్ల రైతులు, కూలీల ఆరోగ్యం దెబ్బతింటున్నదని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది.

ఆత్మహత్యల నివారణ: క్షణికావేశంలో ఈ మందును సేవించి రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని, దీనికి విరుగుడు లేకపోవడం వల్ల 98% కేసుల్లో మరణాలు సంభవిస్తున్నాయని మంత్రి తుమ్మల, సభ్యులు (కడియం శ్రీహరి తదితరులు) పేర్కొన్నారు. ■

పారిశ్రామిక ప్రాంతాల్లో, రోడ్ల పక్కన చెట్లు, గడ్డిని నియంత్రచడానికి.. తేయాకు, పత్తి, బంగాళాదుంపలు తదితర పంటల్లో కలుపు మొక్కలను తొలగించడానికి ఉపయోగిస్తారు.

ఇటువంటి గడ్డి మందులు మొక్కల కణ త్వచాలను నాశనం చేయడం ద్వారా, కిరణజన్య సంయోగక్రియకు అంతరాయం కలిగించడం ద్వారా ఆ మొక్కలు ఎండి పోయేలా చేస్తాయి. దీనివల్ల గంటల్లోనే మొక్కల భాగాలు వేగంగా, స్పష్టంగా ఎండిపోతాయి, వాడిపోతాయి. పారాక్వాట్‌ను గడ్డి, పెద్ద ఆకులతో కూడిన కలుపు మొక్కలను వేగంగా నాశనం చేయడానికి విస్తృతంగా ఉపయోగిస్తారు.

**1964 నుంచి వాణిజ్యపరంగా ఉత్పత్తి**

పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుకు 140 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగంలో ఉన్న, వివాదాస్పదమైన కలుపు మందులలో ఒకటి. 19వ శతాబ్దం చివరలో మొదటిసారిగా సంశ్లేషణ చేయబడినప్పటికీ, కలుపును చంపే దీని సామర్థ్యాన్ని 20వ శతాబ్దం మధ్యలో మాత్రమే గుర్తించారు. 1962 నుంచి వాణిజ్యపరంగా ఉత్పత్తి చెయ్యటం ప్రారంభమైంది. 1964 మొదట అమెరికాలో పురుగు మందుగా ఉపయోగించడానికి నమోదైంది. 1970 దశకం చివరలో మెక్సికన్ గంజాయి పొలాలపై పారాక్వాట్‌ను అమెరికా స్ప్రే చేయించింది. 1985లో జూన్‌లో వెండింగ్ మెషిన్ ద్వారా విక్రయించిన పానీయాలలో ఈ రసాయనం కలవటం ఫలితంగా కనీసం 10 మంది మరణించారు.

**2007లో నిషేధించిన ఈయూ**

అమెరికా 1978లో పారాక్వాట్‌ను అధిక విషపూరిత స్వభావ పదార్థంగా గుర్తించి, పరిమితంగా వాడే పురుగు మందుగా వర్గీకరించింది. 1980-90 దశకాల్లో అనేక దేశాలు దీన్ని నియంత్రించటం ప్రారంభించాయి. పారాక్వాట్ వల్ల ప్రజారోగ్యానికి తీరని హాని జరుగుతోందని స్వీడన్, తదితర ఐరోపా దేశాలు పట్టుబట్టటంతో 2007లో యూరోపియన్ యూనియన్ నిషేధించింది.

ప్రస్తుతం చైనా (దేశీయ వినియోగం మాత్రమే), బ్రెజిల్, థాయిలాండ్‌తో సహా 70కి పైగా దేశాల్లో పారాక్వాట్ గడ్డి మందు వాడకాన్ని నిషేధించాయి లేదా దశల వారీగా వాడకాన్ని నిలిపివెయ్యటానికి నిర్ణయాలు తీసుకున్నాయి. అయినప్పటికీ అమెరికాతో పాటు భారత్ సహా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇప్పటికీ విస్తృతంగా ఉపయోగిస్తూనే ఉన్నారు.

**అమెరికాలో త్వరలో ఉత్పత్తి నిలిపివేత**

పారాక్వాట్ గడ్డి మందు ప్రభావానికి గురైన వారికి పార్కిన్సన్స్ వ్యాధి వస్తోందని నమ్ముతున్నారు. దీని తయారీదారులపై ప్రస్తుతం అమెరికాలో వేలాది వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూన్ నాటికి పారాక్వాట్ గడ్డి మందు తయారీని నిలిపివేస్తానని సింజెంట బహుళ జాతి కంపెనీ ప్రకటించినట్లు "ద గార్డియన్"లో తాజాగా కథనం ప్రచురితమైంది.

**భారత్‌లో పరిస్థితులు**

భారతదేశంలో పారాక్వాట్ డైక్లోరైడ్ వాడకాన్ని నిషేధించాలన్న డిమాండ్ ప్రబలంగా ఉంది. దీన్ని ఉపయోగించడానికి జాతీయ స్థాయిలో అనుమతి ఉంది. అయినప్పటికీ.. దీని అత్యధిక విషపూరిత స్వభావం, దీన్ని తాగటం ద్వారా ఆత్మహత్య చేసుకునే వారి సంఖ్య పెరుగుతుండటంతో ఒడిషా, కేరళ వంటి రాష్ట్రాలు నిషేధించాయి. అయితే, కేరళ గతంలో నిషేధాన్ని అమలు చేసింది. కానీ, పురుగుమందుల తయారీదారులు చట్టబద్ధంగా సవాలు చేసిన తర్వాత 2022లో దాన్ని రద్దు చేసింది.

ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. పారాక్వాట్ విష ప్రభావంతో వందలాది మంది మరణిస్తున్నందున దీన్ని నిషేధించాలని పిటిషనర్లు కోరుతున్నారు. కలుపు మందుపై మీ వైఖరేమిటో వివరించమని హైకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

**9 పంటలకే అనుమతి**

పారాక్వాట్ కలుపు మందును టీ, కాఫీ, పత్తితో సహా తొమ్మిది నిర్దిష్ట పంటలపై మాత్రమే ఉపయోగించడానికి కేంద్ర క్రిమిసంహారకాల బోర్డు రిజిస్ట్రేషన్ కమిటీ

అనుమతించింది. అయితే, దేశంలో 25 రకాల పంటలపై ఉపయోగించ బడుతున్లట్లు పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ ఇండియా సర్వే నివేదికలు సూచిస్తున్నాయి. ఇలా వాడటం భారతీయ క్రిమిసంహారకాల చట్టాన్ని ఉల్లంఘించటమే.

వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు పారాక్వాట్‌ను 'సైనైడ్ కంటే ప్రమాదకరమైనది' అని అభివర్ణిస్తున్నారు. ఎందుకంటే దీనికి విరుగుడు లేదు. అందువల్ల పొలాల్లో దీన్ని పిచికారీ చేసే క్రమంలో దాని విషప్రభావానికి గురైన వారు లేదా దీన్ని క్షణికావేశంలో తీసుకున్న వారికి చికిత్స చేసి రక్షించటం కష్టసాధ్యమైంది. దీంతో మరణాలు రేటు పెరుగుతోంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వంటి వైద్య సంఘాలు దీన్ని వెంటనే పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేస్తున్నాయి.

**దేశవ్యాప్తంగా నిషేధించాలి**

పారాక్వాట్ వంటి అత్యంత విషతుల్యమైన వ్యవసాయ రసాయనాల వాడాకాన్ని వదిలించుకోవడానికి, వాటి వల్ల కలిగే హానిని నిలువరించటానికి పని చేస్తున్నాం. క్లోరో పైరిఫోస్, ఫిరోనిల్ పురుగుమందులు, అలాగే అట్రాజిన్, పారాక్వాట్ డైక్లోరైడ్ కలుపు మందులపై అధ్యయనం చేశాం.

పారాక్వాట్‌ను 9 పంటల్లో వాడటానికి ప్రభుత్వ అనుమతి ఉంటే 25 పంటల్లో వాడుతున్నట్లు మా అధ్యయనంలో తేలింది. దీన్ని వాడే క్రమంలో చాలా మంది దీని విషప్రభావానికి గురై ప్రాణాలు కోల్పోతున్నారు. దీన్ని క్షణికావేశంలో తాగి ఆత్మహత్యల పాలవుతున్న రైతులు, రైతు కూలీల సంఖ్య కూడా చాలా ఎక్కువగా ఉంది. ప్రాథమికంగా ప్రాణాలను చంపడానికి రూపొందించబడిన పురుగుమందుల దీర్ఘకాలిక పరిణామాలను రైతులు, వినియోగదారులు అర్థం చేసుకోవాలి. పురుగుమందుల హాని కరమైన ప్రభావాలపై శాస్త్రవేత్తలు మరింత పరిశోధన చేయాలి. విధాన నిర్ణేతలు కూడా తమ అవగాహనను పెంచుకోవాలి. రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి ఈ విష రసాయనాలను నియంత్రించడంపై దృష్టి పెట్టాలి. అత్యంత విషతుల్యమైన పారాక్వాట్ గడ్డి మందును దేశవ్యాప్తంగా నిషేధించాలి.

(సాక్షి సౌజన్యంతో)

## పారాక్వాట్ తాగి తెలంగాణలో ఏటా 6 వేల మంది మృతి!

తెలంగాణలో పారాక్వాట్ తాగి ఏటా సుమారు 5,500 నుంచి 6,000 మంది చనిపోతున్నారని అంచనా. దేశవ్యాప్తంగా ప్రతి నెలా దాదాపు 1000 కేసులు నమోదవు తున్నాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, 'డాక్టర్స్ ఎగైనెస్ట్ పారాక్వాట్ పాయిజన్' వంటి సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీనిని పూర్తిగా నిషేధించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. కనీసం మండల వ్యవసాయ అధికారి సిఫార్సుతో, ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి విక్రయించేలా నిబంధనలు కఠినతరం చేయాలని పలువురు సూచిస్తున్నారు.



పారాక్వాట్ అనేది పొలాల్లో కలుపు మొక్కలను నాశనం చేయడానికి రైతులు విరివిగా ఉపయోగించే ఒక రసాయనం. ముఖ్యంగా పత్తి వంటి మెట్ట పంటలు, వరి పొలాల గట్ల మీద పెరిగే గడ్డిని తొలగించడానికి దీనిని వాడతారు. తక్కువ ధరకే లభించడంతో దాదాపు ప్రతి రైతు ఇంట్లోనూ ఇది అందుబాటులో ఉంటోంది.

అయితే, ఇదే అనేక కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతోంది. క్షణికావేశంలో ఇంట్లో గొడవలు పడినవారు లేదా ఇతర సమస్యలతో బాధపడేవారు దీనిని తాగి ప్రాణాలు తీసుకుంటున్నారు. ఈ కలుపు మందు అత్యంత విషపూరితమైనది కావడంతో కొద్ది మోతాదులో తాగినా ప్రాణాలు కాపాడటం దాదాపు అసాధ్యమని వైద్యులు చెబుతున్నారు. ఆవేశం తగ్గాక బతకాలని వేడుకున్నా, వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండటం లేదని, శరీరంలోని కీలక అవయవాలు పూర్తిగా దెబ్బ తింటున్నాయని వారు వివరిస్తున్నారు. ఈ విషం చర్మంపై పడినా, వాసన పీల్చినా ప్రమాదకరమే.

# రైతుల రాబోయే ఎరువు బి ఎస్ ఎఫ్ లార్వా!

**మ**న దేశంలో వ్యవసాయం కేవలం ఆహారం కోసం మాత్రమే కాదు, జీవనాధారంగా కూడా ఉంది. అయితే గత కొన్ని దశాబ్దాలుగా రసాయన ఎరువుల అధిక వాడకం వల్ల భూసారం తగ్గిపోతోంది. నేలలో సేంద్రియ పదార్థాలు, సూక్ష్మజీవులు తగ్గిపోవడంతో పంటల దిగుబడులు స్థిరంగా ఉండటం లేదు.

రైతులు మొదట్లో రసాయన ఎరువుల వాడకం వల్ల లాభపడినా, దీర్ఘకాలంలో మాత్రం నష్టాలు ఎదుర్కొంటు న్నారు. ఈ నేపథ్యంలో పరిశోధకులు, రైతులు కొత్త రకాల సహజ ఎరువులపై దృష్టి పెట్టారు. వాటిలో అత్యంత ప్రాధాన్యం పొందుతున్నది బ్లాక్ సొలిడైర్ ఫ్లై (బి ఎస్ ఎఫ్) లార్వామలం. దీనినే ఫ్రాస్ అంటారు.

**ఫ్రాస్ ఉత్పత్తి విధానం**

బిఎస్ఎఫ్ ఒక ప్రత్యేకమైన ఈగ. దీని పిల్లలు (లార్వాలు) వంటింటి చెత్త, కూరగాయల అవశేషాలు, మార్కెట్ వ్యర్థాలు, పశువుల చెత్త వంటి సేంద్రియ వ్యర్థాలను తింటాయి. చెత్తను కరిగించి, జీర్ణం చేసి, చివరగా పుష్కల పోషకాలు ఉన్న మలాన్ని విడుదల చేస్తాయి. ఈ మలాన్నే ఫ్రాస్ అంటారు. అంటే చెత్తగా భావించే పదార్థాలు ఈగల ద్వారా విలువైన సేంద్రియ ఎరువుగా మారతాయి.

**ఫ్రాస్ పోషకాలు :**

ఫ్రాస్‌లో పంటల పెరుగుదలకు, దిగుబడులకు అవసరమైన అన్నిరకాల పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.

**నత్రజని –** ఆకులు పచ్చగా, పెద్దగా పెరిగేందుకు.

**భాస్వరం –** వేర్లు బలంగా, పువ్వులు, గింజలు మెరుగ్గా రావడానికి.

**పొటాషియం –** పంటలు వాతావరణ మార్పులకు, వ్యాధులకు తట్టుకునేందుకు.

జింక్, మాంగనీస్, బోరాన్ వంటి సూక్ష్మపోషకాలు – పంటల సక్రమ పెరుగుదల కోసం.

చిటిన్ – పంటల్లో వ్యాధినిరోధక శక్తి పెంచుతుంది.

నేలలో సూక్ష్మజీవుల సంఖ్యను పెంచి, నేల ఆరోగ్యాన్ని పునరుద్ధరిస్తుంది.

**పంటలకు లభించే ప్రయోజనాలు**

- ఫ్రాస్ వాడకం పంటల పెరుగుదలపై అనేక రకాలుగా ప్రభావం చూపుతుంది.
- వరి, గోధుమ, మొక్కజొన్న వంటి ధాన్య పంటలలో దిగుబడి పెరుగుతుంది.
- టమాటా, క్యాబేజీ, పాలకూర, లెట్యూస్ వంటి కూరగాయలు బలంగా, ఆరోగ్యంగా పెరుగుతాయి.
- సోయాబీన్, పెసలు వంటి పప్పు ధాన్యాల ఉత్పత్తి మెరుగవుతుంది.
- పశువుల మేత పంటలలో ఆకుల పెరుగుదల అధికమవుతుంది.
- మొక్కల్లో క్లోరోఫిల్ శాతం పెరగడం వల్ల పచ్చదనంగా, శక్తివంతంగా మారతాయి.

**రైతులకు ఉపయోగాలు**

- రైతులు తక్కువ ఖర్చుతోనే ఫ్రాస్ తయారుచేసుకోవచ్చు. వంటింటి చెత్త, పశువుల చెత్త వాడుకోవడం వల్ల అదనపు ఖర్చు అవసరం లేదు.
- రసాయన ఎరువులపై ఆధారపడకుండా సహజ ఎరువుతో ఎక్కువ దిగుబడి పొందవచ్చు.
- రైతుల లాభాలు పెరుగుతాయి, ఖర్చులు తగ్గుతాయి.

చెత్తను వృథా కాకుండా విలువైన ఎరువుగా మార్చు కోవడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుంది.

దీర్ఘకాలంలో నేలసారాన్ని కాపాడుతుంది.

**భవిష్యత్తు అవకాశాలు :**

ప్రపంచవ్యాప్తంగా చెత్త నిర్వహణ సమస్య పెద్ద సవాలుగా మారింది. ఈ పరిస్థితిలో బిఎస్ఎఫ్ ఈగల

# ఇక ... రంగుల పత్తి రంగప్రవేశం!

**ఆ**ధునిక సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేస్తుంది. ఇటీవల దేశీయ మార్కెట్ లోని పత్తి పంట దిగుబడుల కోత మిషన్ అడుగు పెట్టగా...తాజాగా పత్తి పంటల సాగులో మరో సంచల నాత్మక మార్పు చోటుచేసుకుంది. ఇప్పటిదాక పత్తి పంట అంటే తెల్ల రంగులో ఉండే పత్తి ఒక్కటే అని అందరికి తెలిసిందే. తెల్లని పత్తితో వడికి, రంగులు అద్ది రకరకాల రంగుల్లో వస్త్రాలను తయారు చేయడం కొనసాగుతుంది.

అయితే వ్యవసాయ రంగంలో సరికొత్త వంగడాల పరిశోధనల చలవతో ఇక మార్కెట్‌లోకి రంగు రంగుల పత్తి రకాలు (కలర్డ్ కాటన్ క్రాప్స్) రంగప్రవేశం చేయ బోతుండటం సంచలనంగా మారింది. ఈ విషయం రైతన్నలను, నేతన్నలను సైతం ఆశ్చర్యపరుస్తుంది.



నాగ్‌పూర్‌లోని ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు గోధుమ, ముదురు గోధుమ, ఆకుపచ్చ రంగుల్లో పండే సరికొత్త పత్తి రకాల వంగడాలను అభివృద్ధి చేశారు. వస్త్ర పరిశ్రమలో రసాయన రంగుల అవసరాన్ని తగ్గించేందుకు ఈ కొత్త రకం రంగుల పత్తి వంగడాలను అభివృద్ధి చేసినట్లుగా వెల్లడించారు.

నాలుగు రకాలు గోధుమ, ముదురు గోధుమ, ఆకుపచ్చ, నీలి, నలుపు రంగుల పత్తి సాగుపై పాతికేళ్లుగా ప్రయోగాలు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం ప్రయోగాత్మకంగా గోధుమ, పచ్చ రంగుల పత్తి పంట రకాలను ముందుగా అభివృద్ధి చేయగలిగామని తెలిపారు. ఇది జాకెట్లు(కోట్లు), చిన్నారుల దుస్తుల తయారికి బాగా ఉపయోగపడుతుందని తెలిపారు.

**రసాయన రంగుల వస్త్రాలకు చెక్**

సహజసిద్ధమైన రంగులతో పండించే రంగుల పత్తితో... వస్త్రాల తయారీలో సింథటిక్ డైయింగ్(రసాయన రంగుల వినియోగం) రంగుల వినియోగాన్ని భారీగా తగ్గించి భారీగా నీటిని ఆదా చేయవచ్చని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఫలితంగా నదుల్లోకి ప్రమాదకర రసాయన వ్యర్థాలు చేరకపోవడం వల్ల పర్యావరణానికి కూడా మేలు జరుగు తుందని తెలిపారు. స్థిరమైన వ్యవసాయం, పర్యావరణ అనుకూల వస్త్రాల వైపుగా రంగుల పత్తి పంట గణనీయమైన పురోగతి వంటిదని అభిప్రాపడ్డారు.

(విధాత వెబ్‌సైట్ సౌజన్యంతో)

■

---

ద్వారా వ్యర్థాలను ఫ్రాస్‌గా మార్చడం ఒక గొప్ప పరిష్కారం. రాబోయే రోజుల్లో :

- సేంద్రియ వ్యవసాయానికి ప్రధాన ఆధారం అవుతుంది.
- రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది.
- రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తుంది.
- పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుంది.

బిఎస్ఎఫ్ లార్వా మలం కేవలం ఒక ఎరువు మాత్రమే కాదు, రైతులకు సహజ సిద్ధమైన వరం. ఇది పంటలకు కావలసిన అన్నిరకాల పోషకాలను అందించి, నేలసారాన్ని కాపాడుతుంది. రైతులు తక్కువ ఖర్చుతోనే అధిక దిగుబడి సాధించగలుగుతారు.

భవిష్యత్తులో రసాయన ఎరువులను తగ్గించి, సేంద్రియ వ్యవసాయానికి దారి తీసే శక్తి ఫ్రాస్‌లో ఉంది. బిఎస్ఎఫ్ ఈగ – రైతుల భవిష్యత్తు స్నేహితుడు, సహజ ఎరువు రూపంలో !

(రైతునేస్తం సౌజన్యంతో)

■

ఆశాభావం ఓడిపోవచ్చు , కాని గమ్యం దిశగా ముమ్ముందుకు సాగడాన్ని మనకు నేర్పుతుంది

# స్వయం సహాయ మహిళలకు కంప్యూటర్, దుకాణ్ !

పొదుపు సంఘాల సభ్యులు, డ్వాక్రా మహిళలకు ఆర్థికంగా అండగా ఉండేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. అలాంటి వాటిలో ఒకటి కంప్యూటర్ దీదీ – దీదీకా దుకాణ్. ఈ కార్యక్రమం కింద ఎంపిక చేసిన డ్వాక్రా మహిళలకు సొంతూరిలోనే ఆదాయం సమకూరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. డ్వాక్రా సంఘాలలో కంప్యూటర్ పరిజ్ఞానం, ఉన్నత విద్య చదివిన మహిళలను కంప్యూటర్ దీదీలుగా నియమించి, ప్రజలకు డిజిటల్ సేవలు అందేలా ఏర్పాట్లు చేశారు.

దీదీకా దుకాణ్ కార్యక్రమం కింద మహిళలకు ఆన్ లైన్ మార్కెటింగ్ మీద అవగాహన కల్పిస్తున్నారు. డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించేందుకు, వారికి ఆర్థిక భరోసా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. అలాంటిదే కంప్యూటర్ దీదీ – దీదీకా దుకాణ్ కార్యక్రమం.




ఈ కార్యక్రమం ద్వారా డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటుగా.. డిజిటల్ సేవలు అందించనున్నారు. కంప్యూటర్ దీదీ – దీదీకా దుకాణ్ కార్యక్రమాన్ని కేంద్రం దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాలలో ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. ఇందులో ఏపీకి కూడా స్థానం దక్కింది. మన రాష్ట్రంలోని గుంటూరు జిల్లా తాడికొండ మండలంలో కంప్యూటర్ దీదీ– దీదీకా దుకాణ్ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేయనున్నారు. రాష్ట్రానికి చెందిన సెర్ప్, యూనిసెఫ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అమలు జరగనుంది.

**కంప్యూటర్ దీదీ..**

కంప్యూటర్ దీదీకి సంబంధించి ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల నుంచి డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉండే ఒక మహిళను ఎంపిక చేస్తారు. ఇంటర్, డిగ్రీ వంటి కోర్సులు చదివి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ఇందులో ప్రాధాన్యం ఉంటుంది. వీరిని కంప్యూటర్ దీదీలుగా నియమిస్తారు. వీరికి ఉచితంగా ట్రైనింగ్ ఇవ్వటంతో పాటుగా ల్యాప్‌టాప్‌లు కూడా అందజేస్తారు.

**కంప్యూటర్ దీదీల పనేంటి..**

కంప్యూటర్ దీదీలు వారికి కేటాయించిన కార్యాలయాల్లో ఉంటూ.. డిజిటల్ సేవలు అందిస్తారు. ఇందు కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా 50 వేలు రుణం కూడా అందిస్తుంది. తక్కువ వడ్డీతో అందించే రుణం సాయంతో కంప్యూటర్లు ఏర్పాటు చేసుకునేందుకు కావాల్సిన బల్లలు, ఇంటర్నెట్ కనెక్షన్, కుర్చీలు వంటివి సమకూర్చుకోవచ్చు. కంప్యూటర్ దీదీలు ప్రజలకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు, టికెట్ల బుకింగ్ వంటి డిజిటల్ సేవలు అందిస్తారు.

**దీదీకా దుకాణ్ అంటే..**

మరోవైపు దీదీకా దుకాణ్ కార్యక్రమం కింద మహిళలకు ఆన్ లైన్ మార్కెటింగ్‌లో ట్రైనింగ్ ఇస్తారు. డ్వాక్రా సంఘాల నుంచి ఎంపిక చేసిన మహిళలకు ఆన్‌లైన్ మార్కెటింగ్ మీద ట్రైనింగ్ ఇవ్వటంతో పాటుగా.. ప్రజలకు అవసరమైన వాటిని ఈ కామర్స్ సంస్థల ద్వారా తక్కువ ధరకే ఆన్ లైన్ ద్వారా తెప్పించుకునే అమ్మేలా శిక్షణ అందిస్తారు. కంప్యూటర్ దీదీ – దీదీకా దుకాణ్ కార్యక్రమం ద్వారా ప్రజలకు వేగంగా సేవలు అందటంతో పాటుగా మహిళలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని అధికారులు చెప్తున్నారు ■

# 50 ఏళ్ళు దాటిన మహిళలకు ఈ పరీక్షలు తప్పనిసరి !

**50** ఏళ్లు పైబడిన మహిళలకు పలు రకాల ఆరోగ్య సమస్యల ముప్పు పొంచి ఉంటుంది. కాబట్టి వాటిని ముందస్తుగా గుర్తించడం కోసం క్రమం తప్పకుండా కొన్ని ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలంటున్నారు వైద్యులు. ఆ పరీక్షల గురించి తెలుసుకుందాం!

50 ఏళ్లు దాటిన మహిళలు, పెరి మెనోపాజ్ దాటిన మహిళలు తప్పనిసరిగా చేయించుకోవలసిన పరీక్షలు కొన్ని ఉన్నాయి. ప్రాథమిక రక్త పరీక్ష మొదలు, మధుమేహం, థైరాయిడ్, కాలేయ పనితీరు, మూత్రపిండాల పనితీరు పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. ఈ వయసు మహిళలకు ఈస్ట్రోజన్ రక్షణ ఉండదు కాబట్టి లిపిడ్ ప్రొఫైల్ పరీక్ష కూడా అవసరమే, అలాగే విటమిన్ బి12, విటమిన్ డి, మెగ్నీషిం, ఫాస్ఫరస్, ఎలక్ట్రోలైట్ పరీక్షలు కూడా చేయించుకోవాలి.

మెనోపాజ్ మహిళల్లో సోడియం లోపం కూడా తలెత్తుతుంది. సాధారణంగా మగతగా, నిస్సత్తువగా అనిపించినప్పుడు పైబడే వయసులో ఇదంతా మామూలే అనుకుంటే పొరపాటు మెనోపాజ్‌కు చేరుకున్న మహిళల్లో సోడియం క్షీణత సర్వసాధారణం. కాబట్టి ఎలక్ట్రోలైట్ పరీక్షతో ఈ లోపాన్ని కనిపెట్టి సరిదిద్దుకోవాలి.

**గర్భాశయం భద్రంగా...**

ఇసిజి పరీక్ష తప్పనిసరి. అవసరాన్ని బట్టి అధిక బిఎమ్‌ఐ ఉన్నవాళ్లకు 2డి ఇకొ పరీక్ష, సిటి యాంజియో కూడా చేయించవలసి వస్తుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముందుగానే పసిగట్టడం కోసం పాప్‌స్మియర్, అల్ట్రాసౌండ్ పరీక్షలు కూడా తప్పనిసరిగా చేయించుకోవాలి. లక్షణాలు బయల్పడినప్పుడే ఈ పరీక్షలను ఆశ్రయించడానికి బదులుగా, ముందు నుంచే ఈ పరీక్షలతో అప్రమత్తంగా వ్యవహరించ గలిగితే, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు సమర్థంగా అడ్డుకట్ట వేయగలిగే వీలు చిక్కుతుంది. అల్ట్రాసౌండ్ పరీక్షతో గర్భాశయ క్యాన్సర్‌ను ముందుగానే కనిపెట్టవచ్చు. పాప్‌స్మియర్ పరీక్ష ప్రతి మూడేళ్లకోసారి చేయించుకోవాలి.

**ఎముకలు దృఢంగా...**

50 ఏళ్లు పైబడిన మహిళల్లో, ఎముక దృఢత్వం, ఎముక ఆరోగ్యం కూడా ఎంతో కీలకం. కాబట్టి అస్థిపంజర కండరాల సాంద్రత, దృఢత్వాలను తెలిపే సార్కోపీనియా పరీక్ష చేయించుకోవాలి. ఈ పరీక్షలో తేడాలుంటే, ఎముక సాంద్రతను తెలిపే డెక్సాస్కాన్ అవసరమవుతుంది. మెనోపాజ్‌కు చేరుకున్న మహిళల అత్యధిక మరణాలు క్యాన్సర్ లేదా ఇతరత్రా వ్యాధులని అనుకుంటాం. కానీ నిజానికి ఎముకలు విరిగి, తత్ఫలితంగా పడకకే పరిమితమై పోవడం, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు తలెత్తడం, గాయం మానక పోవడం, ఇతరత్రా తలెత్తే ఇన్‌ఫెక్షన్ల కారణంగానే మహిళలు ఎక్కువగా చనిపోతూ ఉంటారు. కాబట్టి మధ్య వయసు మహిళల్లో ఎముకల ఆరోగ్యం కీలకంగా మారుతుంది.

**ప్రొటీన్ పెంచాలి**

యాభై ఏళ్లు దాటిన మహిళలకు మధుమేహం, రక్తపోటు పెరుగుతాయి. కాబట్టి వీటిని మందులతో అదుపులో పెట్టుకోవాలి. మానసిక ఆరోగ్యం, భావోద్వేగాలు అదుపు తప్పడం లాంటి సమస్యలను కౌన్సెలింగ్‌తో సరిదిద్దుకోవాలి. బరువును అదుపులో ఉంచుకుంటూ, సమతులాహారం తీసుకుంటూ,ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. పొట్ట పెరగడం పలు రకాల ఆరోగ్య సమస్యలకు సూచన. కాబట్టి పొట్ట పెరగకుండా చూసు కోవాలి. నూనె వాడకం తగ్గించాలి. మాంసాహారాన్ని తగ్గించి శాకాహారం పెంచాలి. ప్రొటీన్ కోసం రోజూ గుడ్లు, పన్నీర్, బఠాణీలు, బీన్స్ ఎక్కువగా తీసుకోవాలి. అలాగే పైన చెప్పిన పరీక్షల ఫలితాలు సాధారణంగా ఉన్నప్పుడు ప్రతి మూడేళ్లకో సారి పరీక్షలు చేయించుకుంటే సరిపోతుంది. లేదంటే ఏడాదికోసారి అన్ని పరీక్షలూ చేయించుకుంటూ ఉండాలి.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

ఇతరులను ద్వేషించడం అంటే నిన్ను నీవు ప్రేమించుకోలేకపోవడం

# మహిళలకు పూచీకత్తు లేకుండా 10 లక్షల రుణం!

**కేం**ద్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం ద్వారా రూ.10 లక్షల వరకు ష్యూరిటీ లేని రుణాలను అందిస్తోంది. సొంత వ్యాపారం ప్రారంభించాలనుకునే లేదా విస్త రించాలనుకునే మహిళలకు ఇది గొప్ప అవకాశం. శిశు, కిషోర్, తరుణ్ లోన్ల ద్వారా ఎలాంటి పూచీకత్తు లేకుండా సులభంగా రుణాలు పొందవచ్చు.

ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం ప్రధాన లక్ష్యం ఏమిటంటే స్వయం ఉపాధిని ప్రోత్సహించడం. అంటే ఈ పథకంలో ఉన్న పెద్ద వెసులుబాటు ఏమిటంటే మీరు ఎలాంటి ష్యూరిటీ లేకుండా లోన్ పొందవచ్చు. మహిళా వ్యవస్థాపకులను ప్రోత్సహించడానికి, ముఖ్యం ప్రభుత్వం దీనిని మూడు వర్గాలుగా విభజించింది అవేంటంటే, శిశు లోన్, కిశోర్ లోన్, తరుణ్ లోన్.

**మూడు వర్గాలుగా లోన్ విభజన**

**శిశు లోన్:** ఇది కొత్తగా వ్యాపారాన్ని ప్రారంభించాలను కునే వారికి లేదా చాలా చిన్న స్థాయిలో ఉన్న వ్యాపారుల కోసం ఉద్దేశించబడింది దీనికి కింద 50,000 రూపాయల వరకు రుణం పొందవచ్చు.

**కిశోర్ లోన్:** వ్యాపారాన్ని ఇప్పటికే ప్రారంభించి, దానిని మరికొంత విస్తరించాలనుకునే వారికి ఈ లోన్ ఇస్తారు. దీనికి కింద రూ. 50,000 నుండి రూ. 5 లక్షల వరకు రుణం పొందచ్చు.

**తరుణ్ లోన్:** ఎవరైనా వ్యాపారం స్టార్ట్ చేసి బాగా నడుస్తుంటే దాన్ని పెద్ద ఎత్తున విస్తరించడానికి లేదా ఆధునీకరించడానికి ఈ లోన్ ఇస్తారు. ఈ పథకం కింద 5 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయల వరకు రుణం పొందచ్చువు.

**మహిళలకు ప్రత్యేక ప్రయోజనాలు**

ఈ ముద్ర పథకం కింద మహిళా దరఖాస్తుదారులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. అనేక బ్యాంకులు, ఆర్థిక సంస్థలు మహిళా వ్యవస్థాపకులకు 0.25% నుండి 0.50% వరకు ప్రత్యేక వడ్డీ రేటు రాయితీలను కూడా అందిస్తాయి. అంతేకాకుండా, రుణ ప్రక్రియ కూడా చాలా సులభం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలు దీని నుండి ఎక్కువ ప్రయోజనం పొందవచ్చు.

**ఏ ప్రయోజనం కోసం రుణం పొందవచ్చు?**

మీ ఆసక్తిని బట్టి మీరు ఏదైనా చిన్న వ్యాపారానికి దరఖాస్తు చేసుకోవచ్చు, టైలరింగ్ లేదా బోటిక్ షాప్, లేదా బ్యూటీ పార్లర్ లేదా సెలూన్, టిఫిన్ సర్వీస్ లేదా ఊరగాయ–తాటి వ్యాపారం, చేతిపనులు, కుటీర పరిశ్రమలు, కిరాణా దుకాణం లేదా ఏదైనా చిన్న తయారీ యూనిట్ ఇలా మీరు ఏ వ్యాపారం పెట్టుకోవాలి అన్న ముద్ర పథకం కింద లోన్ పొందచ్చు.

**ఎలా దరఖాస్తు చేయాలి?**

మీరు ఈ పథకాని ధరఖాస్తు చేసుకోవాలి అనుకుంటే మీ సమీప ప్రభుత్వ లేదా ప్రైవేట్ బ్యాంకు, గ్రామీణ బ్యాంకు లేదా నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్ బి ఎఫ్ సి) ని సందర్శించడం ద్వారా ముద్ర రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

అంతేకాదు ఈ రోజుల్లో, ఉద్యోగ్ మిత్ర పోర్టల్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోచ్చు. ఇక్కడ మీరు మీ అర్హతను తనిఖీ చేసుకోవచ్చు, మీ ఇంటి నుండే సులభంగా లోన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

**ముద్ర లోన్ కోసం అవసరమైన పత్రాలు**

- ఆధార్ కార్డ్ మరియు పాన్ కార్డ్
- చిరునామా రుజువు
- వ్యాపార ఆలోచన లేదా ప్రాజెక్ట్ నివేదిక
- పాస్‌పోర్ట్ సైజు ఫోటో

■

# 'మిస్ ఇన్ఫినిటీ ఆఫ్ ఇండియా' కిరీటధారి దీప్తి శ్రీరంగం!

**ఆం**ధ్రప్రదేశ్‌కు చెందిన దీప్తి శ్రీరంగం 'మిస్ ఇన్ఫినిటీ ఆఫ్ ఇండియా' నిర్వహించిన పోటీలో ప్రతిష్టాత్మకమైన 'మిస్ ఇండియా' కిరీటాన్ని గెలుచుకుంది. 7 సంవత్సరాల కఠిన శ్రమ, పట్టుదల తర్వాత ఆమె ఈ విజయాన్ని సాధించడం విశేషం. దేశవ్యాప్తంగా 500కి పైగా పోటీదారులు పాల్గొన్న ఈ పోటీలో దీప్తి విజేతగా నిలిచింది.



ఈ కార్యక్రమానికి ప్రముఖ సంగీత దర్శకుడు కోటి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. పోటీకి జ్యూరీ సభ్యులుగా ప్రముఖ హీరోయిన్లు మౌనిక కలాపాల, నక్ష శరన్, డా. అక్షయ, ప్రణూప్ జవహర్ పాల్గొని అభ్యర్థుల ప్రతిభను విశ్లేషించారు.

షో ఆర్గనైజర్స్ మాట్లాడుతూ... మహిళా సాధికారత, ఆత్మవిశ్వాసం, భారతదేశ ఐక్యతకు ప్రతీకగా ఈ ఫ్యాషన్ షో నిర్వహించామన్నారు. ప్రతి ఫైనలిస్ట్ తమ రాష్ట్రపు సంస్కృతి సంప్రదాయం, ప్రత్యేకతను ప్రతిబింబిస్తూ పోటీలో పాల్గొనడం చాలా గొప్పగా అనిపించిందన్నారు.

అతిథిగా హాజరైన కోటి మాట్లాడుతూ.... మహిళ అంటేనే అందం. అలాంటి మహిళలు వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొని వాళ్ళ సంస్కృతికి తగినట్టు వేషధారణలో ఫ్యాషన్ షోలో పాల్గొనడం చాలా గొప్పగా అందంగా అనిపించిందన్నారు.

**మార్కాపురం జిల్లాకు శుభ పరిణామం**

చిరంజీవి శ్రీరంగం దీప్తి మార్కాపురం వాసి అయిన శ్రీరంగం నరసింహచార్యులు అనురాధ దంపతుల కుమార్తె. 500మంది పైగా పోటీదారులు పాల్గొన్న ఈ ఫ్యాషన్ షోలో విజేతగా నిలచి ప్రముఖ సినీ సంగీత దర్శకులు శ్రీ కోటి గారి చేతుల మీదుగా మూడు లక్షల రూపాయల ప్రైజ్ మనీని, అవార్డుని, కిరీటాన్ని అందుకున్నారు. గ్రామీణ వాతావరణం కలిగిన వెనుకబడిన ప్రాంతం నుంచి ఈ పోటీలలో పాల్గొని విజేతగా నిలవడం సాహసోపేతమే ... మన మార్కాపురం జిల్లాకు ఇటువంటి అవార్డు దక్కడం శుభ పరిణామం.

మహిళా సాధికారికత, ఆత్మవిశ్వాసం, భారతీయ ఐక్యతకు, ఇంటలిజెన్సీకి ప్రత్యేకంగా నిలిచే ఇటువంటి మరెన్నో గొప్ప షోలలో పాల్గొని విజేతగా నిలవాలని చిరంజీవి శ్రీరంగం దీప్తికి శ్రీ మేడవరం మల్లికార్జున శర్మ ప్రభృతులు అభినందనలు తెలియజేశారు. ■

## విజయవాడ గాయనికి ప్రధాని ప్రశంస



విజయవాడ గాయని శ్రీలలిత ఆలపించిన ఓ భక్తి గీతానికి అరుదైన గౌరవం దక్కింది. ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గాదేవిని స్తుతిస్తూ ఆమె పాడిన పాటను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. విజయవాడ సత్యనారాయణపురం ప్రాంతానికి చెందిన గాయని శ్రీలలిత దుర్గమ్మపై 'కనక దుర్గా మహా ప్రమావిత' అనే పాటను ఆలపించారు.

ఈ పాట యూట్యూబ్ లింకును ప్రధాని మోదీ తాజాగా తన సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ "దుర్గాదేవిని ఆరాధించడం వల్ల మనసు అపారమైన శక్తిసామర్థ్యాలతో నిండిపోతుంది" అని పేర్కొన్నారు. ప్రధాని స్వయంగా ఒక తెలుగు భక్తిగీతాన్ని ప్రశంసించడంతో ఈ పాట ఒక్కసారిగా వైరల్ అయింది. ■

ఎక్కువ చేయలేమేమో అనే జంకుతో అసలే ప్రయత్నించకపోవడం అసమర్థుల లక్షణం !

# ఎండిన నదికి తిరిగి జీవం పోసిన మహిళా శక్తి!

**త**మిళనాడులోని వెల్లూర్ జిల్లాలో 15 ఏళ్లుగా ఎండిపోయిన నాగనదిని 44,000 మందికి పైగా గ్రామీణ మహిళలు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్ల సహాయంతో పునరుద్ధరించారు. భూగర్భ జలాలను పెంచేందుకు 3,500 కంటే ఎక్కువ రీఛార్జ్ బావులను నిర్మించి, నదిని మళ్లీ ప్రవహింపజేశారు.

నాగనది ఎండిపోవడంతో, భూగర్భ జలాలు 20 అడుగుల నుండి 100 అడుగులకు పడి పోయాయి. వ్యవసాయం లేక మగవారు వలస వెళ్ళిపోయారు, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.



♦ ఆర్ట్ ఆఫ్ లివింగ్ చొరవతో, మహిళలు స్వయం – సహాయక బృందాలుగా ఏర్పడి నాగనది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగస్వాములయ్యారు.

♦ కృషి: ఎటు వంటి భారీ యంత్రాలు లేకుండా, కేవలం శ్రమదానంతో, 20 అడుగుల లోతు రీఛార్జ్ బావులు, చెక్‌డ్యామ్‌లను నిర్మించారు. ఈ నిర్మాణాల వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకింది.

♦ ఫలితం: ఈ ప్రాజెక్టు ద్వారా 366 చదరపు కిలోమీటర్ల పరివాహక ప్రాంతం పునరుజ్జీవం పొందింది. భూగర్భ జలాలు పెరిగి, ఎండిపోయిన నది 2018 నుండి మళ్లీ జీవనదిగా ప్రవహిస్తోంది.

♦ ప్రభావం: సుమారు 4.8 లక్షల మంది ప్రజల జీవితాలపై ప్రభావం చూపిన ఈ ప్రాజెక్టు, 25కి పైగా నదులను పునరుజ్జీవింపజేసే భారీ ప్రణాళికలో భాగం

♦ **నది పునరుజ్జీవనం:** 20 ఏళ్లుగా ఎండిపోయిన 600 కి.మీల పరివాహక ప్రాంతం (క్యాచ్‌మెంట్ ఏరియా) కలిగిన నాగనది చెక్‌డ్యామ్‌ల, రీఛార్జ్ బావుల నిర్మాణంతో మళ్ళీ ప్రవహిస్తోంది.

♦ **మహిళా శక్తి :** దాదాపు 40,000 మంది స్థానిక మహిళలు స్వచ్ఛందంగా, 'నో–కాంట్రాక్టర్' పద్ధతిలో సొంతంగా రీ ఛార్జ్ బావులు తవ్వి, నదిని పునరుజ్జీవింప జేశారు.



♦ **సాంకేతికత – సంప్రదాయం :** జియో స్పేషియల్ మ్యాపింగ్‌ను ఉపయోగించి నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి, చెక్ డ్యామ్‌లు, బౌల్డర్ చెక్‌లతో భూగర్భ జలాలను పెంచారు.

♦ **ఫలితాలు:** నది ప్రవహించడంతో 3 పంటలు పండటం, భూగర్భ జల మట్టం 14 అడుగుల వరకు పెరగడం, వ్యవసాయం తిరిగి పుంజుకోవడం జరిగింది.

**సమాజ భాగస్వామ్యం**

♦ ఆర్ట్ ఆఫ్ లివింగ్, రైతులతో, గ్రామస్తులతో కలిసి సామాజిక బాధ్యతగా ఈ ప్రాజెక్టును చేపట్టింది.

♦ పంటలలో వైవిధ్యం రసాయన రహిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా శాశ్వత పరిష్కార మార్గాలను చూపారు. ■

ఆలోచన నీది కాక, మాట నీది కాక , బాట నీది కాకుంటే ఇక నీవెందుకు?


**మీకు తెలుసా ?**

**గత 46 ఏళ్ళల్లో (1970-2016 ) ..**

- ఉష్ణోగ్రత 0.48 డిగ్రీలు పెరిగింది
  - దీనివల్ల పంట దిగుబడులు 3%-10% వరకు తగ్గాయి.
- వానాకాలంలో పడే వాన 26 మి.మీ.లు తగ్గింది
  - 0.1 మి.మీ. వాన తగ్గితే, దిగుబడులు 0.2% -0.3% వరకు తగ్గుతాయి
  - మొత్తంగా పంట దిగుబడులు 13%-18% వరకు తగ్గాయి.
- వ్యవసాయ ఆదాయం సగటున 15%-25% తగ్గింది

## వాతావరణం మారుతోంది...

ఏటేటా పెరుగుతున్న ఎండలు



వద్దనుకుంటే వానలు...



జీవం కోల్పోతున్న భూములు.....



పెరుగుతున్న పంటకు పురుగులు, తెగుళ్ళు ...



## బతుకు భద్రత తగ్గుతోంది...



వాన కోసం ఎదురుచూపులు...



అనుకోని వరదలు ...



మొలకకు అందని నీళ్ళు



చేతికి అందని పంటలు

రానున్న 30 ఏళ్ళల్లో (2020-2050) ...

ఉష్ణోగ్రత 1%- 1.4% పెరుగుతుందని అంచనా ... ఒక్కసారి పరిస్థితి ఊహించండి!!

## మనకున్నది ఇప్పుడు ఒకే మార్గం...

## వాతావరణ మార్పులను తట్టుకునేలా సంసిద్ధం కావడం

NABARD

RNI Regd. No: TELTEL/2003/16365 MAHILA SADHIKARATHA Postal Regd No: HCD-1064/2024-26

*Publication Date:01-04-2026* Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 *Posting Date: 05/06-04-2026*




ముమ్మిడివరంలో, బీబీనగర్ లో 'వాష్' సమావేశ దృశ్యాలు

## ఏపిమాస్ సి ఇ ఓ , ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి ఎఫ్ పి ఓ ల సందర్శన దృశ్యాలు !




ఆదిలాబాద్ అంకోలిలోని 'రైతు సాధికారత' ఎఫ్ పి ఓ లో .. సిరికొండ సిరిసంపద ఎఫ్ పి ఓ లో ..




లక్ష్మణ్ చాంద లో ....

To ADDRESS



సిరి నిర్మల్ ' ఎఫ్ పి ఓ చే సి ఎస్ కు సన్మానం

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషానగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089